MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 21 సంచిక: 7 రంగారెడ్డి మార్చి 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## అనంతపురంలో రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమ్మేళన దృశ్యం !






ప్రసంగిస్తున్న మంత్రులు శ్రీ కాకాణి గోవర్ధనరెడ్డి, శ్రీమతి ఉషాశ్రీ చరణ్, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎన్ నాగలక్ష్మి







ప్రసంగిస్తున్న ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, ప్రభుత్వ విప్,ఎం ఎల్ ఏ శ్రీ కాపు రామచంద్రారెడ్డి, హాజరైన ఎఫ్ పి ఓల ప్రతినిధులు, తదితరులు, ప్రసంగిస్తున్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ చిరంజీవి చౌదరి, యాక్షన్ ఫ్రెటర్నా డైరెక్టర్ శ్రీ మల్లారెడ్డి




చెన్నైలో సాధన్ సదస్సులో శ్రీ సి ఎస్ రెడ్డి



నాబార్డ్ తెలంగాణా ఆర్ ఓ – సి జి ఎం శ్రీమతి సుశీలచే స్కూల్ బ్యాంక్ సందర్శన



సమీక్ష 18 వ పేజీలో




ఉల్లి విలువ గొలుసు పెంపుపై కర్నూలు సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీ మధుమూర్తి



అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు !

మీకు తెలుసా


?

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - ❖ దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - ❖ 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - ❖ మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

# మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

# వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 21 సంచిక 7



సంపాదకీయం

## ముఖాముఖి !

'సమ్ముఖమ్మున రాయబారమెందులకు? ...' అని పెద్దలమాట. అంటే, ఎదురెదురుగా వుండి, హాయిగా ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం వున్నప్పుడు ,మళ్ళీ ఎవరో రాయబారం వహించి, అటు మాట యిటు, యిటు మాట అటు చేరవేయవలసిన అవసరం వుండదు కదా అని అర్థం. ఒకరికొకరు మనసు విప్పి మాట్లాడుకోగలిగితే అప్పటివరకు ఎంతో సంక్లిష్టంగా అనిపించే ఎన్నో సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయి, కనీసం మార్గాన్వేషణ జరుగుతుంది. ఏపిమాస్ మొదటినుంచి కోరుకుంటున్నదిదే. ఎవరికి వారుగా, లేదా ఏ కొందరో కలసి వ్యక్తిగత స్థాయిలో చేపట్టే చిన్నాచితకా పనుల సంగతి పక్కనబెడితే, సమూహాల స్థాయిలో, వ్యవస్థీకృతంగా చేపట్టవలసిన బృహత్ కార్యక్రమాలకు దాదాపు తప్పనిసరిగా ప్రభుత్వాల అండదండలు, సహాయసహకారాలు అవసరమవుతాయి. ఇక ప్రభుత్వాల ప్రోత్సాహంతో, భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాల గురించి చెప్పవలసిన పనేలేదు. ఎందుకంటే, విధానాలను రూపొందించేది, స్పష్టాస్పష్టంగానైనా మార్గదర్శనంచేసేది, ప్రోత్సహించేది, పరోక్షంగానైనా కార్యక్రమాల బాగోగులను బేరీజువేసేది ప్రభుత్వాలే కాబట్టి. ఏపిమాస్ లాంటి స్వచ్ఛందసంస్థలో, మరొక వ్యవస్థవారో నిర్వహణభారం వహించి ముందుకు నడిపిస్తున్నా , ఏవో దాతృత్వ సంస్థలు కొంతమేరకు అవసరాలు తీర్చినా, ప్రభుత్వాల వైపునుంచి ఈ తోడ్పాటు సజావుగా లేకుంటే బండినడవడం కష్టమే. కాగితాలమీదనో, కంప్యూటర్‌లోనో ప్రణాళికలు రూపొందిస్తున్నప్పుడు అన్నీ అలవోకగానే అనిపిస్తాయి, కనిపిస్తాయి. కాని కార్యరంగంలోకి దిగినప్పుడు, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలు చేపట్టినప్పుడు వాస్తవ పరిస్థితులకు, నియమనిబంధనలకు, ప్రణాళికా నిర్దేశాలకు ఎంతటి అంతరం వున్నదో బోధపడుతుంది. 'చెప్పేవారికేం తెలుస్తుంది చేసేవారి కష్టం' అన్నట్టు ఆచరణపరంగా ఎన్నో సమస్యలు చుట్టుముడతాయి. ఈ సమస్యల గురించి, అవరోధాల గురించి విధాన నిర్ణయాలు, ప్రణాళికా రూపకల్పనలుచేసే ప్రభుత్వాలకు సహజంగానే అంతటి క్షేత్రస్థాయి అవగాహన వుండదు. అందుకే వీలున్నంతగా ముఖాముఖి చర్చలు, సంప్రతింపులు అవసరం.అలా ముఖాముఖి జరిగితే కార్యక్రమాలను నిర్వహిస్తున్నవారి సమస్యల లోతుపాతులు ప్రభుత్వాలకు, ప్రభుత్వాల అవకాశాలు, అధికార పరిమితులు వీరికి అవగతమై ఒక ఆచరణాత్మక వాతావరణం ఏర్పాటుకు మార్గం సుగమమవుతుంది. ఇప్పుడు అదే జరిగింది. రాయలసీమలోని ఎఫ్ పి ఓల (రైతు ఉత్పత్తిదారు సంస్థల) ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, మార్కెటింగ్, ఆహార పరిశ్రమలు, సహకారశాఖ మంత్రి శ్రీ కాకాణి గోవర్ధనరెడ్డి గారు, మహిళా శిశు, విభిన్న ప్రతిభావంతుల , వృద్ధుల సంక్షేమశాఖ మంత్రి శ్రీమతి ఉషాశ్రీ చరణ్ గారు, పలువురు ఉన్నతాధికారులు ఫిబ్రవరి 4 వ తేదీన అనంతపురంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సమావేశమై ఎఫ్ పి ఓల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఉభయుల మధ్య ఒక అవగాహనాపూర్వక వాతావరణం ఏర్పడింది. తక్షణం తేల్చిచెప్పగలిగిన కొన్ని అంశాలను మంత్రులు అప్పటికప్పుడే చెప్పారు. కొన్నిటిని నెరవేర్చడానికి , మరికొన్నిటిని పరిశీలించడానికి హామీలు యిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ, మార్కెటింగ్, ఆహార పరిశ్రమలు, సహకార శాఖ తోడ్పాటుతో ఏపిమాస్, యాక్షన్ ఫ్రెటర్నా సంస్థలు సంయుక్తంగా ఈ సమ్మేళనాన్ని నిర్వహించాయి. మౌలిక అవసరమైన ఈ ముఖాముఖిని నిర్వహించడం ఎంతైనా సంతోషంగా వుంది. ఒకేసారి అన్ని సమస్యలు పరిష్కారం కావాలనుకోవడం అత్యాశే అవుతుంది. 'సరైన ప్రారంభం జరిగితే సగం సాధించినట్టే ' అంటారు కదా! ఈ నెలలోనే కర్నూలులో ఉల్లి రైతులతోను, చిత్తూరులో మామిడి, టమాటా రైతులతోను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్న ముఖాముఖి సమావేశాలు జరగడం, వీటన్నిటిలో ఏదోఒక రూపంలో ఏపిమాస్ ప్రాతినిధ్యం వుండడం మరింత ఆనందదాయకం. ఈ విలువగొలుసు పెంపు కార్యక్రమాలు రైతు వ్యవసాయంలో ఉత్సాహంగా కొనసాగడానికి దోహదం చేస్తాయి. మహారాష్ట్రలో ఒక ఉల్లి రైతు 512 కిలోల ఉల్లిపాయలు అమ్మి , యింటికి కేవలం రెండు రూపాయల చెక్కుతో తిరిగివెళ్ళాడన్న వార్త చూశాంకదా! అలాంటి దుస్థితి రాకుండా ముందు జాగ్రత్తగా యిలాంటి ముఖాముఖిలు ఉపయోగపడతాయి. ఈ ముఖాముఖిలలో పాల్గొన్న గౌరవ మంత్రులకు, అధికారులకు, రైతులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, అందరికీ ధన్యవాదాలు. ఒక్కటొకటిగా అన్ని సమస్యలు పరిష్కారమై ఎఫ్ పి ఓలు రైతులకు కొంగుబంగారమై, సమాజానికి ఒక వెలకట్టలేని ఆభరణంగా రూపుదిద్దుకుంటాయని ఆశిద్దాం.

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

**అయోమయంగా పరుగు పెట్టడం కంటె ఆత్మ విశ్వాసంతో ఒక్కో అడుగు వేసినా ఎంతో మేలే**

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. కృష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

➪ రాయలసీమ ఎఫ్ పి ఓల సమ్మేళనం... ...05
➪ డిజిటల్ పరిజ్ఞానంతో లైంగిక సమానత్వం! ...07
➪ ఉల్లి ఆధారిత ఉత్పత్తులతో అధిక లాభాలు ...09
➪ 512 కిలోల ఉల్లిపాయలకు 2 రూపాయలు ...09
➪ నాబార్డ్‌చే ఎస్ హెచ్ జి ఉత్పత్తుల ప్రదర్శన ...10
➪ నాబార్డ్ సి జి ఎం స్కూల్ బ్యాంక్ సందర్శన ...11
➪ ఎఫ్ పి ఓలలో మహిళా ప్రాధాన్యం ! ...12
➪ 'వాష్'తో మహిళల ఆత్మగౌరవం సురక్షితం! ...14
➪ చిత్తూరులో మామిడి రైతుల చర్చావేదిక ...16
➪ అడ్డుగోడలను కూల్చివేస్తూ ... ...18
➪ పెరటికోళ్ళ పెంపకంతో అదనపు ఆదాయం ...20
➪ మహిళా సమ్మాన్ ? బ్యాంక్ ఎఫ్‌డి? ...21
➪ తెలంగాణా పల్లెల్లో 'అంకురాల' ఏర్పాటు ...23
➪ జొన్నలపై మూడు దశాబ్దాల పరిశోధన ! ...24
➪ దిగుబడి తగ్గి, ధర తగ్గి మిర్చి రైతు బేజారు ...27
➪ ఇక తప్పనిసరి అయితేనే డిఎన్ఏ పరీక్ష ! ...29
➪ శరీర ఆరోగ్యాన్నంతటిని చక్కదిద్దే నడక ! ...30
➪ మహిళా దినోత్సవ సోపాన మార్గం ...33
➪ స్వయంసహాయ మహిళల దశ తిరిగింది ...34

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

నీ బలహీనతలు నిన్ను పూర్తిగా పాడుచేయకముందే నిన్ను నీవు బాగుచేసుకో

# రాయలసీమ ఎఫ్ పి ఓల సమ్మేళనం... ఒక ఆశావహ దృశ్యం!

**– సి. గోపాలరాజు**

రాయలసీమ ప్రాంత రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓల) పాలకవర్గ సభ్యులు, (బోర్డ్ డైరెక్టర్లు) రైతులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్న సమ్మేళనం 2023 ఫిబ్రవరి 4 వ తేదీన అనంతపురంలోని ఆర్.డి.టి సమ్మిళిత ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగింది. ఏపి మాస్, యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్, సహకార, ఆహార పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనం ఉదయం 10.0 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు జరిగింది.



ఈ సమ్మేళనానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ, సహకార, ఆహార పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా శిశు, విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల సంక్షేమశాఖ మంత్రి శ్రీమతి ఉషాశ్రీ చరణ్ ముఖ్య అతిధులుగా పాల్గొని ఎఫ్ పి ఓలు సాధించిన విజయాలను, అవి ఎదుర్కొంటున్న సవాళ్ళను తెలుసుకుని, తగు సలహాలు అందించారు.

ఈ సమ్మేళనానికి రాయలసీమ జిల్లాలలోని 140 ప్రగతిశీల రైతు ఉత్పత్తిదారు సంస్థల నుండి దాదాపు 300 మంది చిన్న , సన్నకారు రైతులు ముఖ్యంగా మహిళా రైతులు పాల్గొని రైతు ఉత్పత్తిదారు సంస్థల ద్వారా ఇప్పటివరకు రైతుల అభివృద్ధికి వారు చేపట్టిన వివిధ కార్యక్రమాల అనుభవాలను పంచుకున్నారు. వీరితోపాటు ప్రభుత్వ విప్ శ్రీ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.నాగలక్ష్మి, మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్, కో ఆపరేటివ్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ చిరంజీవి చౌదరి, జెడ్పీ ఛైర్ పర్సన్ శ్రీమతి జోయ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే శ్రీ విశ్వేశ్వర రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సి ఇ ఓ శ్రీ శ్రీధర్ రెడ్డి, ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ శ్రీ మల్లారెడ్డి, ఏడీసీసీ ఛైర్పర్సన్ శ్రీమతి లిఖిత, నాటక అకాడెమీ ఛైర్పర్సన్ శ్రీమతి హరిత, ఆర్టీసీ రీజనల్ ఛైర్ పర్సన్ శ్రీమతి మంజుల, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు శ్రీ రాజశేఖర్ రెడ్డి, రమణా రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ చంద్రా నాయక్, జిల్లా ఉద్యాన అధికారి శ్రీ రఘునాథ రెడ్డి, ఎఫ్పీవోల నిర్వాహకులు, రైతులు, ఇంకా వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని వారి అనుభవాలను వివరిస్తూ, ఎఫ్ పి ఓల సుస్థిరతకు సలహాలు, సూచనలు అందించారు.

**రైతుభరోసా కేంద్రాలతో ఎఫ్ పి ఓల అనుసంధానం**

మంత్రి శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఎఫ్పిఓలను రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానం చేస్తామని హామీయిచ్చారు. రైతులు నిర్వహించుకునే ఎఫ్ పి ఓలు బలపడినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎఫ్ పి ఓలు అంతర్జాతీయ స్థాయిలో ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిరుపయోగంగా ఉన్న కమిటీల స్థలాలు, నిల్వ వసతులను ఎఫ్ పి ఓలు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. వేర్హౌస్ల ఏర్పాటు కోసం ఎఫ్ పి ఓలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వమే తయారు చేసిన మార్కఫ్ బ్రాండ్ ద్వారా ఎఫ్ పి ఓల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలో రూ.1250

నీ ప్రతికూల భావాలు నిన్నే కుంగదీస్తాయ్, నీ మొండితనం నీకే చేటు చేస్తుంది

కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాట్లకు నిర్మాణాలు ప్రారంభించనున్నామన్నారు. చిరు ధాన్యాల సాగు పెంచడంలో సైతం ఎఫ్ పి ఓలది కీలక పాత్ర అన్నారు. విమానాలలో సైతం మన ఎఫ్ పి ఓలు చిరుధాన్యాలతో తయారుచేసిన రెడీ టు ఈట్ ఆహార పదార్థాలు అందించే రోజులు రావాలన్నారు. సూక్ష్మ సేద్యం విషయంలో అనంత జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

**అంగన్‌వాడీలద్వారా 'చిరు' ఆహారాలు**

స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా పిల్లలు, గర్భిణీలకు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని అంగన్ వాడీల ద్వారా అందించే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి శ్రీమతి ఉషాచరణ్ పేర్కొన్నారు. జిల్లాలో ఎఫ్ పి ఓలు బలంగా ఉన్నాయని, ముఖ్యంగా మహిళలు నిర్వహించే ఎఫ్ పి ఓల పని తీరు బాగుందని, అవి మరింత అభివృద్ధిచెందాలని ఆమె ఆకాంక్షించారు.

**ప్రభుత్వ పథకాలతో అనుసంధానం**

వ్యవసాయపరంగా అనంతలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఎఫ్ పి ఓల అభివృద్ధికి అవకాశాలు కూడా మెండుగా ఉన్నాయని, మహిళలు నడిపించే ఎఫ్ పి ఓలకు ఎక్కువ సహకారం అందిస్తున్నామని, అన్ని రకాల ప్రభుత్వ పథకాలను అనుసంధానంచేసి ఎఫ్ పి ఓల అభివృద్ధికి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు.

**ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి**

జిల్లాలో రైతుల తలరాతలు మార్చే ఉల్లి, టమాట, మిరప పంటలకు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ కాపు రామచంద్రారెడ్డి కోరారు. అనంతపురం జిల్లాను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తయారు చేయాలని ఆయన అన్నారు.

**విలువ జోడించాలి**

రైతులు పండించిన పంటలకు, ఉద్యాన ఉత్పత్తులకు ప్రభుత్వ సహకారంతో ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా అదనపు విలువలు జోడించినట్లయితే రైతులు లాభసాటి ధరకు ఓపెన్ మార్కెట్లో అమ్మడానికి అవకాశాలు మెరుగవుతాయని, ఇందుకు కావలసిన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి మంత్రులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

**లైసెన్సులు, వసతులు సమకూర్చాలి**

ఎఫ్ పి ఓల వ్యాపారాభివృద్ధికి కావలసిన లైసెన్సులు, మౌలిక వసతులు, గ్రాంట్లు ప్రభుత్వ సహకారంతో అందించినట్లయితే అవి సుస్థిరాభివృద్ధి సాధించడానికి దోహదమవుతాయని ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెటింగ్, సహకార, ఆహార పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ చిరంజీవి చౌదరి ప్రారంభ సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. ఇంకా వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల కమిషనర్లు, ఏ.పి.ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ శ్రీధర్‌రెడ్డి గారు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

**సమ్మేళనం ముఖ్యఉద్దేశాలు**

- రైతు ఉత్పత్తిదారు సంస్థల నాయకులు వారి విజయ గాథలను, అనుభవాలను, చేపట్టబోయే కొత్త కార్యక్రమాల విశేషాలను, ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వారి సవాళ్ళకు పరిష్కారాలను గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మద్దతును పొందేందుకు ఒక వేదికగా పనిచేయడం
- పి ఎం ఎఫ్ ఎం ఇ., ఆర్ కె వి వై, యం ఐ డి హెచ్, ఏ ఐ ఎఫ్ మొదలైన వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందే ప్రయత్నం చేయడం, కూరగాయల, పండ్ల సమష్టి మార్కెటింగ్ గురించి చర్చించడం. మార్కెటింగ్‌ను చేపట్టడానికి ఎఫ్‌పిఓలకు అవసరమైన మౌలిక సదుపాయాలు వున్నాయని నిర్ధారించడం
- అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని, ఎఫ్‌పిఓలు చిరుధాన్యాల దుకాణాలను ఏర్పాటు చేయడం, కొనుగోలుదారులు–

(మిగతా 15 వ పేజీలో)

మనసు చెదిరి,కోరికలు చెలరేగితే విలాసాలు చేరువవుతాయి, వినాశనాన్ని మిగుల్చుతాయి

# డిజిటల్ పరిజ్ఞానంతో లైంగిక సమానత్వం!

## 2023 'ప్రపంచ మహిళా దినోత్సవ' ఇతివృత్తం

**లైం**గిక సమానత్వ సాధనలో డిజిటల్ పరిజ్ఞానం ప్రాధాన్యాన్ని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. అందుకే 'అందరికీ డిజిటల్ పరిజ్ఞానం: లైంగిక సమానత్వంకోసం నవీకరణలు, సాంకేతికత' అనే ఇతివృత్తాన్ని 2023వ సంవత్సరం 'ప్రపంచ మహిళా దినోత్సవ' నినాదంగా నిర్దేశించింది.

ఈ ఆత్యధునాతన యుగంలో డిజిటల్ సాంకేతికత మన దైనందిన జీవనంతో ఎంతటి విడదీయరాని బంధంగా పెనవేసుకుపోయిందో ఈ నినాదాన్ని ప్రకటించిన సందర్భంగా ఐక్యరాజ్య సమితి విశదీకరిస్తూ, ఏవైనా బ్యాంకి లావాదేవీలు జరుపుకోవాలన్నా, విద్యాభ్యాసానికైనా, డాక్టరును సంప్రతించాలన్నా, ఆఖరుకు మన ఆత్మీయులతో మాట్లాడాలన్నా కూడా డిజిటల్ సాంకేతికత తెలియకపోతే సాధ్యంకాదని, అన్నీ డిజిటల్ సాంకేతికతతోనే ముడిపడి వున్నాయని పేర్కొంది.

ప్రపంచ జనాభాలో మహిళలు సగభాగమైనప్పటికి, 37% మహిళలు ఇంటర్నెట్ ఉపయోగించడం లేదని, ఇంటర్నెట్ ఉపయోగించే పురుషులతో పోలిస్తే 25 కోట్ల 90 లక్షల మంది మహిళలకు ఇంటర్నెట్ అందుబాటులో లేదని ఐక్యరాజ్య సమితి వివరించింది. మహిళలు ఇంటర్నెట్‌ను సదుపాయాన్ని పొందలేకపోతే, డిజిటల్ నైపుణ్యాలను సంతరించుకోకపోతే వారు విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, ఇంజినీరింగ్, గణిత శాస్త్రాలకు (స్టెమ్) సంబంధించిన రంగాలలో ఉద్యోగ అవకాశాలు పొందడంలో వెనుకబడిపోతారని, 2050 నాటికి 75% ఉద్యోగావకాశాలు ఈ నాలుగు రంగాలలోనే వుంటాయని ఆ ప్రకటన హెచ్చరించింది. ఉదాహరణకు స్టెమ్‌కు సంబంధించిన కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) రంగంలో ప్రస్తుతం 22% మంది మహిళలు మాత్రమే వున్నారని ఐక్యరాజ్య సమితి తెలిపింది.

మహిళలకు డిజిటల్ సాంకేతికత అలవడితే, వారికి అనువైన నవీకరణలు, సృజనాత్మక ప్రక్రియలు రూపొందడానికి దోహదపడుతుందని, తద్వారా లైంగిక సమానత్వ సాధనకు ఉపకరిస్తుందనేది దీని సారాంశం. డిజిటల్ సాంకేతిక నైపుణ్యం పురుషులు, మహిళల మధ్య ఆర్థిక,సామాజికపరమైన అంతరాలను తగ్గించే మార్గాలను అన్వేషించడానికి ఉపకరిస్తుందని, ఆన్‌లైన్‌లో, ఐ సి టి తోడ్పాటుతో సాగే లైంగిక హింసను అరికట్టడానికి దోహదంచేస్తుందని ఆ ప్రకటన పేర్కొన్నది.

- 2022 వ సంవత్సరపు గణాంకాల ప్రకారం పురుషులు 69%, మహిళలు 63% ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నారు
- 511 దేశాలలో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం 38% మంది మహిళలు వ్యక్తిగతంగా ఆన్‌లైన్ లైంగిక హింసకు గురయ్యారు
- పురుషులతో పోలిస్తే 25కోట్ల 90లక్షల మంది మహిళలకు ఇంటర్నెట్ అందుబాటులో లేదు

**సమానత్వం కాదు సమంజసత్వం**

'ఇంటర్నేషనల్ విమెన్స్ డే' అనే సంస్థ మరొక అడుగు ముందుకు వేసి, సమానత్వం (ఈక్వాలిటీ) కాదు, 'సమంజసత్వాన్ని (ఈక్విటీ) గుండెలకు హత్తుకుందాం' (ఎంబ్రేస్ ఈక్విటీ) అని నినదించింది. 2023 వ సంవత్సరపు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగానే కాకుండా, ఆ తర్వాత కూడా 'మనందరం పూర్తిగా సమంజసత్వాన్ని హత్తుకుందాం' అనే ప్రచార ఇతివృత్తాన్ని నిర్దేశించింది.

లైంగిక సమంజసత్వం వుంటే బాగుంటుంది అనేదికాదు, వుండి తీరవలసింది. లైంగిక సమంజసత్వంపై దృష్టి కేంద్రీకరించడమనేది ప్రతి మహిళా సమూహం జీవలక్షణం కావాలని 'ఇంటర్నేషనల్ విమెన్స్ డే' నిర్ద్వంద్వంగా పేర్కొన్నది. సమానత్వానికి,సమంజసత్వానికి వుండే తేడాను అర్థంచేసుకోవడం కొంత క్లిష్టమైన వ్యవహారమేనని చెబుతూ, సమానావకాశాలు యిక ఎంతమాత్రం సరిపోవని

**జీవితాన్ని సార్థకం చేసుకునే అవకాశం ఆగమంటే ఆగదు, చేజార్చుకుంటే తిరిగి రాదు**

స్పష్టంచేసింది. సమానత్వ మంటే అవకాశాలను, వనరులను సమానంగా సమకూర్చడం. ఇందుకు భిన్నంగా, సమంజసత్వం అంటే వివిధ వ్యక్తుల, సమూహాల విలక్షణ స్థితిగతులను దృష్టిలో వుంచుకుని సమానమైన ఫలితాలను సాధించడానికి అనువైనరీతిలో వారికి ఆవకాశాలను, వనరులను కల్పించడం.

ఒక చక్కని ఉదాహరణతో ఈ తేడాను వివరించారు. ఇద్దరు పిల్లలు వున్నారు. వారికి ఆకలైతే యివ్వడానికి యాపిల్స్, అరటి పళ్ళు వున్నాయి. ఇద్దరికీ సమానంగా యాపిల్స్ యివ్వవచ్చు. కాని ఆ యిద్దరిలో ఒకరికి యాపిల్స్ పడవు. మరి అతనికి యాపిల్స్ యిస్తే మేలుచేసినట్టా, కీడుచేసినట్టా? అందుకని అతనికి యాపిల్స్ బదులు అరటి పళ్ళు యివ్వడం సమంజసం. ఇదే సమానత్వానికంటె మరింత ఆమోదయోగ్యమైన సమంజస సిద్ధాంతం!

**మహిళా దినోత్సవం మొదలైన తీరు...**

ప్రపంచ స్థాయిలో మహిళా ఉద్యమాలకు 110 సంవత్సరాలకు పైగా చరిత్ర వున్నది. 1909 ఫిబ్రవరి 28 వ తేదీన ఉత్తర అమెరికాలో మహిళలకు ఓటు హక్కు కోసం పిడికిలి బిగించిన మహిళా ప్రతిఘటన కాలక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి దారి తీసిన తొలి అడుగు. అయితే అది కేవలం ఉత్తర అమెరికాకే పరిమితమైంది. అనంతరం 1911 మార్చి 19న ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జెర్లాండ్ దేశాలు ఉద్యోగినులు, శ్రామిక మహిళల సమ్మె, నిరసనలతో హోరెత్తిపోయాయి.

మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై ఆ రోజున జర్మనీకి చెందిన సోషలిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్, రష్యా విప్లవోద్యమ, మహిళా ఉద్యమ ప్రముఖురాలు అలెగ్జాండర్ కొలంతయ్ నేతృత్వంలో జర్మనీ, ఆస్ట్రియా, డెన్మార్క్, స్విట్జెర్లాండ్, ఇతర ఐరోపా దేశాల సోషలిస్ట్ మహిళలు పెద్ద సంఖ్యలో సమ్మెలు, పాద యాత్రలు జరిపారు. అప్పటినుంచి ప్రతి ఏటా మార్చి 19న మహిళా దినోత్సవాన్ని పాటిస్తూ వచ్చారు. క్రమంగా ఉద్యోగినుల సమస్యలే కాకుండా శాంతియుత సహజీవనం, మహిళల హక్కులు కూడా ఈ ఉద్యమంలో భాగమైనాయి. 1915లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిలిపివేయాలంటూ జెట్కిన్ స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో ఒక ప్రదర్శన నిర్వహించారు. యుద్ధానికి సంబంధించిన ఉభయ శిబిరాల మహిళలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

అనేక దేశాలలో ఒకే రోజున ఉద్యమించిన మహిళల చైతన్య శక్తికి, సంఘటిత కార్యాచరణకు సంకేతంగా 1911 మార్చి 19వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గణుతికెక్కింది. 1975 నుంచి ఐక్యరాజ్య సమితి ఈ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నది.


**గద్దె దిగిన చక్రవర్తి**

ఇక ఇప్పటి అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి తొలి మెట్టుగా అత్యంత ప్రసిద్ధమైనది 1917 మార్చి 8న రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ఆహారం, శాంతి కోసం రష్యన్ మహిళలు జరిపిన మహా ప్రదర్శన! జెట్కిన్, కొలంతాయ్ లు ఇరువురూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఈ సమ్మె ఆ నగర మంతటా ఐదురోజులపాటు అల్లర్లకు, దాడులకు దారితీసింది. ఈ అల్లర్ల పర్యవసానంగా రష్యా చక్రవర్తి జార్ నికోలస్-2 పదవి నుంచి వైదొలగాడు. ఈ విధంగా నాటి మహిళా మహోద్యమం ఒక చక్రవర్తిని పదవీచ్యుతుని చేసి, 'ఫిబ్రవరి విప్లవం' గా చరిత్రలో నిలిచిపోయింది. (1917 వరకు రష్యా జూలియస్ క్యాలెండర్‌ను అనుసరించేది. ఆ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమం జరిగింది ఫిబ్రవరి 24-28 తేదీలలో. అందుకే అది ఫిబ్రవరి విప్లవమని పేరు పొందింది.

1918 నుంచి రష్యాలో ప్రస్తుతం అనుసరిస్తున్న గ్రెగేరియన్ క్యాలెండర్ వాడుకలోకి వచ్చింది. గ్రెగేరియన్ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమ తేదీలు మార్చి 8-12 అవుతాయి. ఆ తర్వాత లెనిన్ నాయకత్వంలో రష్యాలో ఏర్పడిన తొలి సోవియెట్ ప్రభుత్వంలో కొలంతాయ్ మంత్రి అయ్యారు. ఆమె పట్టుపట్టి 'మహిళల మహా పోరాటానికి గుర్తు' గా మార్చి 8వ తేదీని అధికార సెలవుదినంగా ప్రకటింపజేశారు ■

# ఉల్లి ఆధారిత ఉత్పత్తులతో అధిక లాభాలు




**ఉ**ల్లికి ధర లేనప్పుడు ఉల్లి ఆధారిత ఉత్పత్తులు సిద్ధం చేయడం ద్వారా మంచి ధరలు పొందవచ్చని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ శ్రీమతి ఉమాదేవి పేర్కొన్నారు. ఉద్యాన శాఖ, ఏపిమాస్ సంయుక్త ఆధ్వర్యంలో 2023 ఫిబ్రవరి 10 వ తేదీన కర్నూలులో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉల్లి ఆధారిత ఉత్పత్తులు చేసే పరికరాలకు 75 శాతం ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఉల్లి రైతులను కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా సోలార్ డ్రైయింగ్ యూనిట్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఇప్పటివరకు కల్లూరు మండలం తడకనపల్లిలో 16, బేతంచెర్ల మండలంలో 16 సోలార్ డ్రైయింగ్ యూనిట్లు ఏర్పాటయ్యాయని తెలిపారు. తడకనపల్లిలో మరో 15, కోడుమూరు మండలంలో 50 యూనిట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు.

జిల్లా వ్యవసాయాధికారిణి శ్రీమతి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు సంఘటితంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకొని పండించిన పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా మంచి ధరలు పొందవచ్చని పేర్కొన్నారు. నాబార్డు డీడీఎం శ్రీ పార్థవ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు నాబార్డు సహకారమందిస్తుందన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ ఉల్లికి ధర లేనప్పుడు ఉల్లి గోదాములు ఏర్పాటు చేసుకుని నిల్వ ఉంచుకొని మంచి ధరలు ఉన్నప్పుడు అమ్ముకుంటే రైతులు లాభాలు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీ ఎం ఎఫ్ ఎం ఈ, ఏపీఎఫ్‌పీఎస్ స్టేట్ ప్రాజెక్టు ప్రతినిధి శ్రీ సుభాష్, బనవాసి కేవీకే శాస్త్రవేత్త, డాక్టర్ సుజాతమ్మ, ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి, ఏపిమాస్ సలహాదారు డాక్టర్ ఎల్లమంద రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ■

## 512 కిలోల ఉల్లిపాయలకు 2 రూపాయలు!

**కొ**నబోతే కొరివి.. అమ్మబోతే అడవి అన్న చందంగా మారింది దేశంలో రైతుల పరిస్థితి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక.. కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదు. తాజాగా, ఓ రైతు ఎన్నో ఆశలు నింపుకుని ఉల్లి సాగు చేయగా.. తీరా పంట చేతికందే సమయానికి ధరలు పడిపోయాయి. షోలాపూర్ జిల్లా బోరగావ్ గ్రామానికి చెందిన రైతు రాజేంద్ర చవాన్ (58) ఉల్లి పంటను సాగుచేశారు. తన పొలంలో పండిన ఉల్లిని ఆయన ఫిబ్రవరి 17న షోలాపూర్ మార్కెట్‌కు తీసుకెళ్లారు. ఉల్లిపాయల ధరలు పడిపోవడం వల్ల కిలో రూ.1 చొప్పున కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెప్పారు. గత్యంతరలేక మొత్తం 512 కిలోల ఉల్లిపాయలను రూ.512లకు అమ్మేశారు. పొలం నుంచి పంటను తీసుకొచ్చేందుకు రవాణా, కూలీల ఖర్చు, మార్కెట్‌కు సంబంధించిన ఇతర వ్యయాలు కలిసి మొత్తం రూ.509.51 అయ్యింది. అంటే అతడికి మిగిలింది రూ.2.49. దాన్ని కూడా రౌండ్ ఫిగర్ చేసిన మార్కెట్ కమిటీ అధికారులు రూ.2 చెక్కును రైతు చేతిలో పెట్టారు. చెక్కుపై కూడా 15 రోజుల తర్వాత బ్యాంకులో జమచేసేలే ముందు తేదీ వేయడం గమనార్హం! ■

# నాబార్డ్‌చే జగిత్యాలలో ఎస్ హెచ్ జి ఉత్పత్తుల ప్రదర్శన

తెలంగాణా రాష్ట్రం జగిత్యాల జిల్లాలో జిల్లాస్థాయి గ్రామీణ వృత్తికళాకారులు, స్వయంసహాయ సంఘాల సభ్యులు రూపొందించిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ ఉత్సవాన్ని నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయు కార్యాలయుం మూడురోజులపాటు నిర్వహించింది. 2023 జనవరి 4 వ తేదీన నాఫ్స్‌కాబ్, తెలంగాణా సహకార కేంద్రబ్యాంక్ ఛైర్మన్



శ్రీ కొండూరు రవీందర్ రావు ఈ ప్రదర్శనను నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల సమక్షంలో ప్రారంభించారు. టి జి బి, కరీంనగర్ డిసిసిబి, డి ఆర్ డి ఏ, సెర్ప్ జిల్లాస్థాయి సీనియర్ అధికారులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కరీంనగర్ క్లస్టర్, దానికి పొరుగున వున్న వరంగల్లు, ఖమ్మం, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలనుంచి 35 మందికిపైగా గ్రామీణ వృత్తి కళాకారులు ఈ ప్రదర్శన, విక్రయ ఉత్సవంలో పాల్గొన్నారు.

శ్రీమతి సుశీల చింతలో తన ప్రారంభోపన్యాసంలో గామీణ వృత్తికళాకారులను, స్వయంసహాయ సంఘాల సభ్యులను ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నందుకు అబినందించారు. ఇలాంటి ప్రదర్శన ప్రాముఖ్యాన్ని గురించి



ఆమె వివరిస్తూ, ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకుని తమ మార్కెటింగ్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, వినియోగదారుల యిష్టాయిష్టాలను అవగాహన చేసుకోవాలని, తమ ఉత్పత్తులకు ధరలను నిర్ణయంలోని హెచ్చుతగ్గులను అర్థంచేసుకోవాలని కోరారు.

ఈ ప్రదర్శనలో రెడీమేడ్ దుస్తులు, జౌళి సంచులు, తోలుఉత్పత్తులు, నగిషీనగలు, వెదురుతో చేసిన ఆలంకరణ ఉత్పత్తులు, సుగంధద్రవ్యాలు, ఆప్పడాలు, స్థానిక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వ్యవసాయ నూతనోత్పాదనలను, ఆర్థిక అక్షరాస్యత అవగాహన ప్రక్రియలను కొన్ని స్టాల్స్‌లో ప్రదర్శించారు.

ఈ ఉత్సవం ముగింపు సభ జగిత్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి షేక్ యాస్మీన్ బాషా అధ్యక్షతన జరిగింది. జగిత్యాలలో ఈ ప్రదర్శనను నిర్వహించి, ఆ పట్టణ వినియోగదారులు



స్వయంసహాయ సంఘాలసభ్యులు రూపొందించిన ఉత్పత్తులను కొనుగోలుచేసుకునే అవకాశాన్ని కల్పించినందుకు నాబార్డ్‌ను శ్రీమతి షేక్ యాస్మీన్ బాషా అభినందించారు. ప్రదర్శనలో తమ ఉత్పత్తులను ప్రదర్శించినవారికందరికి ఆమె సర్టిఫికెట్లను అందజేశారు.

అదనపు కలెక్టర్ శ్రీమతి బి ఎస్ లత, జగిత్యాల జిల్లా ఎల్ డి ఎం శ్రీ వెంకటరెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆర్ ఎం శ్రీ అరుణ్ కుమార్, కరీంనగర్ డి సి సి బి – సి ఇ ఓ శ్రీ ఎల్ సత్యనారాయణ రావు తదితరులు ఈ ప్రదర్శనను తిలకించారు. ■

భవిష్యత్తుపట్ల నీకు గౌరవం లేకపోతే నీ పట్ల భవిష్యత్తుకూ గౌరవం వుండదు

# నాబార్డ్ సి జి ఎం శ్రీమతి సుశీల స్కూల్ బ్యాంక్ సందర్శన

తెలంగాణా రాష్ట్రం జనగావ్ జిల్లా చిల్పూరులోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ బ్యాంక్‌ను నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల 2023 ఫిబ్రవరి 13 వ తేదీన సందర్శించారు. నాబార్డ్ వరంగల్లు క్లస్టర్ కార్యాలయం జి ఎం డాక్టర్ వై హరగోపాల్, ఇతర అధికారులు కూడా ఆమె వెంట వున్నారు. 2023 ఫిబ్రవరి 13 వ తేదీ నుంచి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా ఆ పాఠశాలలో



వరంగల్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌తో కలసి ఆర్థిక, డిజిటల్ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగేలా ఒక వీదినాటకాన్ని ప్రదర్శించారు. నాబార్డ్ అధికారులే కాకుండా, వరంగల్లు డి సి సి బి సి ఇ ఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, స్థానిక గ్రామీణ ప్రజాప్రతినిధులు, ఘనాపూర్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**ఉపాధ్యాయుని చొరవతో ...**

ఆ పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీ వెంకటేశ్వర్లు విద్యార్థులకు ఆర్థిక క్రమశిక్షణను అలవాటుచేయాలన్న సంకల్పంతో ఈ స్కూల్ బ్యాంక్ ను ప్రారంభించారు.

6 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఉపాధ్యాయుడు శ్రీ వెంకటేశ్వర్లు మార్గదర్శకత్వంలో తమ చదువుతోపాటు ఈ బ్యాంక్‌లో క్యాషియర్, అకౌంటెంట్,




మేనేజర్, హెల్ప్‌డెస్క్ బాధ్యతలు నిర్వహిస్తారు. మామూలుగా బ్యాంకులలో మాదిరిగానే పాస్ పుస్తకాలు, డిపాజిట్, విత్‌డ్రాయల్ ఫారాలు, నగదు రిజిస్టర్లు, లెడ్జర్లను ఈ పాఠశాల బ్యాంక్‌లో నిర్వహిస్తారు. పాఠశాల పనిదినాలలో ప్రతిరోజూ, రోజుకు మూడు దఫాలుగా, ప్రతిసారి అరగంట వంతున ఈ బ్యాంక్ పనిచేస్తుంది. పాఠశాలలో బ్యాంక్ వుండడం, విద్యార్థులే దానిని నర్వహిస్తుండడంతో విద్యార్థులకు పొదుపుచేసే అలవాటు కలుగుతుందని బ్యాంక్ నిర్వాహక ఉపాధ్యాయుడు శ్రీ వెంకటేశ్వర్లు చెప్పారు. పాఠశాలలోఈ బ్యాంక్ ఏర్పాటు ప్రభావాన్ని గురించి వివరిస్తూ, విద్యార్థులు చిరుతిండ్లపై చేసే ఖర్చు తగ్గిందని ఒక విద్యార్థి పేర్కొన్నాడు.

విద్యార్థులకు యింత చక్కగా పొదుపుచేసే ఆలవాటును, ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహిస్తున్నందుకు ఉపాధ్యాయుడు శ్రీ వెంకటేశ్వర్లును, ఉత్సాహంగా బ్యాంక్ సేవలను నిర్వహి స్తున్నందుకు విద్యార్థులను నాబార్డ్ సి జి ఎం శ్రీమతి సుశీల అభినందించారు.




బ్యాంక్ లావా దేవీలను డిజిటల్ గా నిర్వహించుకోవడంకోసం ఆ బ్యాంక్‌కు ఒక టాబ్‌ను ఆమె బహూకరించారు. ఇంతేకాకుండా మరింత ప్రోత్సాహకంగా కొంతమొత్తాన్ని ఆమె ఆ బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు.

■

తప్పును కప్పిపుచ్చుకోవడం వల్ల గౌరవం రాదు, ఒప్పుకోవడంవల్ల వస్తుంది

# మహిళా సి ఇ ఓలతో ఎఫ్ పి ఓలలో మహిళా ప్రాధాన్యం !

**– వినాయకరెడ్డి**

ఏపిమాస్ సంస్థ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, బీహార్ రాష్ట్రాలలో ఏర్పాటుచేసిన స్వయం యాజమాన్య ఎఫ్ పి ఓలలో (రైతు ఉత్పత్తి దారు సంస్థలలో) మహిళల నాయకత్వాన్ని , ప్రాతినిధ్యాన్ని, ప్రాధాన్యాన్ని పెంచడానికి నిరంతరం కృషి జరుగుతున్నది. ప్రతి ఎఫ్ పి ఓలో సి ఇ ఓతో సహా ఇద్దరు సిబ్బంది వుంటారు. కొన్ని ఎఫ్ పి ఓలను ఇద్దరూ మహిళలే నిర్వహిస్తుండగా, మరికొన్నింటిలో పురుషులు నిర్వహిస్తున్నారు.

మహిళలనిర్వహణలోని ఎఫ్ పి ఓలలో అన్ని కార్యక్రమాలలో మహిళలలకు పెద్దపీట వేస్తున్నారు. వీరిలో కొంత మంది వివాహితులు కాగా మరికొంత మంది అవివాహితులు. అయితే పనితీరులో ఆ తారతమ్యం లేకుండా పోటాపోటీగా పనిచేస్తూ, వీలున్నంతగా మహిళలను ముందంజ వేయించడానికి కృషిచేస్తున్నారు.

వచ్చేనెలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోనున్న సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో ఏపిమాస్ సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన మహిళా సి ఇ ఓల నిర్వహణలోని ఎఫ్ పి ఓల స్థితిగతులను తెలుసుకునే ప్రయత్నంచేశాం. ఆ ఎఫ్ పి ఓల గురించి స్వయంగా ఆ సి ఇ ఓలు తెలిపిన విశేషాలను చూద్దాం.

**కౌండిన్య ఎఫ్ పి ఓ**



నా పేరు వాణి. నేను కౌండిన్య రైతు ఎఫ్ పి ఓలో సి ఇ ఓ గా పనిచేస్తున్నాను. మా ఎఫ్ పి ఓలో సేల్స్‌పర్సన్ కూడా మహిళే కావడం ఎంతో ఆనంద దాయకమైన విషయం. మా ఎఫ్.పి.ఓ.లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి మేము పంచాయతీల వారీగా సమావేశాలు పెట్టి, ఎఫ్.పి.ఓల మీద అవగాహన కల్పించాము. చాలామంది మహిళలు ప్రస్తుతం పాడి ఆవుల మీద ఆధారపడుతున్నారు కావున వాళ్ళకి పశువుల దాణాను మార్కెట్ కంటే తక్కువ ధరకే అందిస్తున్నాం. ఏపిమాస్ చాలామంది మహిళలకు వ్యాపార ప్రణాళిక మీద, చట్టబద్ధ కార్యక్రమాల మీద, విలువ గొలుసు కార్యక్రమాల మీద శిక్షణలు ఇవ్వడం వలన ఆ అనుభవంతో మా ఎఫ్ పి ఓను సజావుగా జరుపుకోగలుగుతున్నాం. వలన దాదాపు 212 మంది మహిళా రైతులు మా ఎఫ్.పి.ఓ నందు సభ్యత్వం తీసుకోవడం జరిగింది.

**పీలేరు ఎఫ్ పి ఓ**



నా పేరు ప్రత్యూష. నేను పీలేరు ఎఫ్ పి ఓలో సి ఇ ఓ గా పనిచేస్తున్నాను. మా ఎఫ్ పి ఓ కార్యవర్గంలో ముగ్గురు మహిళా సభ్యులు వుండడంవల్ల మహిళా రైతులకు మేలుచేసే కార్యక్రమాలను ఎక్కువగా చేపట్టడానికి మరింతగా అవకాశం వుంటుండడం సంతోషకరమైన విషయం. ఎఫ్ పి ఓ తీసుకొనే నిర్ణయాలలో ఈ మహిళా సభ్యులు ముఖ్య భూమిక పోషిస్తున్నారు.

మా ఎఫ్ పి ఓ లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి మేము ఇప్పటివరకు క్రింది చర్యలు తీసుకున్నాము.

1. పెరటి కోళ్ళ యాజమాన్యంపై శిక్షణలు ఇవ్వడం
2. పాడి యాజమాన్యంపై శిక్షణలు ఇవ్వడం
3. పెరటి తోటల పెంపకంలో భాగంగా మహిళా సభ్యులకు విత్తనాల పంపిణీ
4. ఎఫ్ పి ఓ లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి ప్రోత్సాహకంగా సమావేశాలలో ,శిక్షణలలో పాల్గొనే మహిళా సభ్యులకు బహుమతులు యివ్వడం
5. ఒంటరి మహిళలకు పెయ్యదూడలను ఇచ్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషిచేయడం

ఈ కార్యక్రమాలతో మా ఎఫ్ పి ఓలో మహిళా సభ్యుల సంఖ్య 279 కు పెరగడం చాలా సంతృప్తిగా వుంది.

కష్టం లేని చోట సుఖానికి విలువ వుండదు



**కలికిరి ఎఫ్ పి ఓ**

నా పేరు దీప. నేను కలికిరి ఎఫ్ పి ఓ లో సి ఇ ఓ గా పనిచేస్తున్నాను. కలికిరిఎఫ్ పి ఓ లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి మహిళలు ఎఫ్ పి ఓ లో సభ్యులుగా చేరడం వలన ఉపయోగాలను రాత్రి సమావేశాలు ఏర్పాటు చేసి వివరించాము. ఏపిమాస్ సహకారంతో సభ్యరైతులకు శిక్షణలు , క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేశాము.

భవిష్యతులో సభ్య రైతులకు వ్యాపార ప్రణాళికల మీద, చట్టబద్ధ కార్యక్రమాల మీద మరింతగా అవగాహనకల్పించడంతో పాటు విజయవంతంగా నడుస్తున్న ఎఫ్ పి ఓలకు, లేక కంపెనీలకు క్షేత్ర సందర్శనలకు మహిళా సభ్య రైతులను తీసుకెళ్ళడానికి ప్రణాళిక చేసుకుంటున్నాము.

**రామసముద్రం ఎఫ్ పి ఓ**



నా పేరు అంబిక. నేను రామసముద్రం ఎఫ్ పి ఓలో సి ఇ ఓ గా పని చేస్తున్నాను. నాతో పాటు శ్రీకన్య సేల్స్ పర్సన్‌గా పని చేస్తోంది. మా ఎఫ్ పి ఓలో ముగ్గురు మహిళలు కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. భవిష్యత్తులో మొత్తం కార్యవర్గ సభ్యులలో 75% ప్రాధాన్యత మహిళలకు ఇవ్వాలని కార్యవర్గ సమావేశంలో తీర్మానించడం జరిగింది. మహిళా రైతులను కార్యవర్గంలో భాగస్వాములను చేయడం వలన ఆర్థిక, వ్యాపార వ్యవహారాలలో వారి నిర్ణయాలు ఎఫ్ పి ఓకు మరింతగా దోహదపడతాయని విశ్వసిస్తున్నాము. మా రైతు సంఘంలో ఇప్పటివరకు 704 మంది మహిళా సభ్య రైతులు వుండడం మాకు ఎంతైనా గర్వకారణం. ఈ సంఖ్యను ఇంకా పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాము. భవిష్యత్తులో మహిళా సభ్యరైతుల నైపుణ్యాలు పెరగడానికి వారికి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, వారు పండించిన పంటలకు మార్కెట్ సదుపాయాలను సొంతంగా అన్వేషించడంలో శిక్షణ ఇవ్వడం, వీలైనన్ని ఎక్కువగా క్షేత్ర సందర్శనలకు తీసుకువెళ్ళడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాము.

**సుగుటూరు గంగమ్మ ఎఫ్ పి ఓ**



నా పేరు జానకి, నేను శ్రీ సుగుటూరు గంగమ్మ ఎఫ్ పి ఓలో సి ఇ ఓగా పనిచేస్తున్నాను. మా ఎఫ్ పి ఓలో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో జరిగే సమావేశాలలో చర్చించి చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పుడు మా సంస్థలో దాదాపు 40% మంది మహిళలు సభ్యులు గా వుండడం సంతోషదాయకమైన విషయం. మా ఎఫ్ పి ఓ లో పురుషులతో సమానంగా మహిళలు కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలనేది మా అభిమతం. ఇందుకోసం మహిళా రైతులకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను, శిక్షణలు అనుభవజ్ఞులైన వారి ద్వారా నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నాము. ఈ విషయమై ఏపిమాస్ ను కూడా ఇదివరకే సంప్రతించాము. మహిళలకు చిన్నచిన్న వ్యాపారాలు చేసే అవగాహన వుంటుంది. స్వయంసహాయ సంఘాలలో వారు ఇదివరకే సభ్యులుగా వుండడం వలన వారు ఎఫ్ పి ఓలో చేరినట్లయితే వారి అనుభవం ఎఫ్ పి ఓకు ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. మహిళా రైతుల నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం.

**నిమ్మనపల్లి ఎఫ్ పి సి**



నా పేరు స్వరూప రాణి, నేను నిమ్మనపల్లి ఎఫ్ పి సి లో సి ఇ ఓ గా విధులు నిర్వర్తిస్తున్నాను. నాతోపాటుగా మరో ఇద్దరు మహిళా సిబ్బంది ఎఫ్ పి సి లో పనిచేస్తున్నారు. మేము సంవత్సరానికి సుమారుగా కోటి రూపాయల వ్యాపార లావాదేవీలు చేస్తున్నాము. మా ఎఫ్ పి సి లో ప్రస్తుతం 630 మంది మహిళా రైతులు సభ్యులుగా వున్నారు. మా ఎఫ్ పి సి లో మహిళా ప్రాతినిధ్యం పెరగడానికి గ్రామ, మండల స్థాయిలలో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాము. భవిష్యత్తులో మహిళా రైతులతో ఎఫ్ పి సి అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయించి, వారికి ఆర్థిక

(మిగతా 28వ పేజీలో)

# 'వాష్'తో మహిళల ఆత్మగౌరవం సురక్షితం!

– ఎస్. ప్రహల్లాద

ప్రారంభమైన అనతి కాలంలోనే తొంభై వేల కుటుంబాలలోని మహిళలకు చేరువైన 'వాష్ ' కార్యక్రమాలు, మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) కార్యక్రమాలను రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో 'ఇందిరా క్రాంతి పథం' తోడ్పాటుతో ఏపిమాస్ విజయవంతంగా అమలు జరుపుతున్నది. పేద కుటుంబాలకు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించి, వాటిని పాటించే విధంగావారిని చైతన్య పరచడమే ప్రధాన అశయంగా వాష్ కార్యక్రమాలను అమలు జరుపుతున్నారు.



గ్రామీణ , పట్టణ ప్రాంతాలలో మురికివాడలలోని పేద కుటుంబాల స్థితిగతులను గమనిస్తే క్రింది విషయాలు మనకు గోచరిస్తాయి.

- గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు తమ ఇండ్లలో మరుగుదొడ్లు లేని కారణంగా మలవిసర్జనకోసం (బహిర్భూమికి) , చెరువుల దగ్గరకు గాని లేదా పొలాల లోకి గాని వెడుతుంటారు. ముఖ్యంగా మహిళలు పగటిపూట అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తున్నది.
- మహిళలు పగటిపూట బహిర్భూమికి వెళ్లినప్పుడు ఆకతాయిలవలన అనేక ఇబ్బందులకు, అత్యాచారాలకు సైతం గురిఅవుతున్నట్లు వార్తలు వింటుంటాం.
- గర్భిణీ స్త్రీలు లేదా అనారోగ్యానికి గురిఅయిన మహిళలు తమ ఇంటి వద్ద మరుగుదొడ్లు లేని కారణంగా పగటిపూట బహిర్భూమికి వెళ్ళాలంటే చాలా మానసిక ఒత్తిడికి, అనారోగ్యానికి గురిఅవుతున్నారు. కొన్ని కుటుంబాలు లెట్రిన్లను నిర్మించుకున్నా సరిగ్గా నీరు లేదని లేదా రిపేర్ వచ్చిందని వాటిని ఉపయోగించుకోవడం లేదు. లెట్రిన్ కోసం నిర్మించిన గదులను కొన్ని కుటుంబాలవారు అదనపు గదులుగా వినియోగించుకొనుచున్నారు.

ఒకవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, మరోవైపు స్వచ్ఛంద సేవా సంస్థలు అనేక కార్యక్రమాలు చేపట్టి మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టినా కూడా ఒక అంచనా ప్రకారం ఇప్పటికి దేశంలోని 20 శాతం కుటుంబాలు మల విసర్జనకు బహిర్భూమికి వెడుతున్నట్టు గణాంకాలు పేర్కొంటున్నాయి. 'వాటర్ ఆర్గ్' తోడ్పాటుతో ఏపిమాస్ పేద కుటుంబాల మహిళల ఆత్మగౌరవం పెంపొందించాలన్న సదుద్దేశంతో 'వాష్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. వీటిలో ముఖ్యమైనవి.

- సురక్షిత నీటి వినియోగం, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణ అనే అంశాలపై పేద కుటుంబాలను చైతన్యపరిచి వాటిని సక్రమంగా పాటించే విధంగా శిక్షణ యివ్వడం
- ఆసక్తి గల పేద కుటుంబాల వారికి మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్మాణానికి లేదా వాటి మరమ్మతులకు రుణసహాయం సమకూర్చడం
- సురక్షిత మంచినీటి కోసం మంచినీటి కుళాయిలను ఏర్పాటుచేఉకోవడానికి, లేదా వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేసుకొనడానికి రుణసహాయం అందించడం
- వికలాంగులకోసం ప్రత్యేక మరుగు దొడ్ల నిర్మాణాలు

**ఎత్తుగడలు**

ఈ వాష్ కార్యక్రమాలను పేదల ముంగిటకు తీసుకొని పోవుటకు ఏపిమాస్ ప్రత్యేకంగా ఈ రంగంలో నిష్ణాతులైన సిబ్బందిని నియమించింది. ఈ సిబ్బంది మండల మహిళా సమాఖ్యలు, మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమావేశాలకు హాజరై వారికి వాష్ కార్యక్రమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు.

మండల మహిళా సమాఖ్యల సమావేశాలలో , రైతు ఉత్పత్తిదారు సంస్థల సమావేశాలలో విస్తృతంగా చర్చించి మరుగుదొడ్లు లేని లేదా మరుగుదొడ్లను వినియోగించని కుటుంబాల వారిని గుర్తిస్తారు. వీరిలో ఆర్థికంగా జరుగుబాటు వున్న కుటుంబాల వారిని స్వంతంగా మరుగుదొడ్లు నిర్మించుకొనే విధంగా ప్రోత్సహిస్తారు. మరుగుదొడ్లు నిరుపయోగంగా వున్న కుటుంబాలను గుర్తించి, వారిని చైతన్య పరచడం జరుగుతున్నది. సామాజిక వత్తిడిని పెంచి మరుగుదొడ్ల నిర్మాణము చేపట్టే విధంగా మహిళా సంఘ సభ్యులకు మొదటి ప్రాధాన్యత యిస్తున్నారు.

**ఆర్థిక భరోసా:**

మొదటి దశలో మరుగుదొడ్లు లేదా స్నానాల గదులు లేదా సురక్షిత నీటి సదుపాయాల కొరతలను గుర్తించి వాటి నిర్మాణానికి అయ్యే ఖర్చును అంచనా వేస్తున్నారు.

రెండవ దశలో ఏపిమాస్ సిబ్బంది మహిళా సంఘాల సమావేశానికి హాజరై వాటి నిర్మాణానికి అయ్యే ఖర్చును రుణంగా యిచ్చి, వారు ఆ డబ్బుతో మరుగుదొడ్డి నిర్మించుకునే విధంగా మహిళా సంఘాల ను ప్రోత్సహిస్తుంటారు.

మూడవ దశలో ఋణం మంజూరయిన తరువాత వాటి నిర్మాణాన్ని, వినియోగాన్ని పర్యవేక్షించడం జరుగుతుంది.

నాలుగవ దశలో ఋణాన్ని పొందిన సభ్యులు నెలవారి కంతులలో వారి సంఘాలకు చెలిస్తారు.

**వాష్ కార్యక్రమాల ప్రగతి:**

ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ తెలంగాణాలలో తొంభై వేల కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నాయి. ప్రతి కుటుంబం కూడా వారి



అవసరాన్నిబట్టి రెండు వేల రూపాయల నుండి యాభై వేల రూపాయల వరకు అప్పులు తీసుకొని తమకు కావలసిన మరుగు దొడ్లు, స్నానపు గదులు, నీటి శుద్ధి యంత్రాలు మొదలగు వాటిని నిర్మించుకున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రారంభం అయిన వాష్ కార్యక్రమాలు మరింతగా విస్తరించి మరుగుదొడ్లు లేని ప్రతి కుటుంబానికి చేరువఅయి వారుకూడా మరుగుదొడ్లను వినియోగించుకునే విధంగా తయారు చేస్తాయని ఆశిద్దాం. ■

## రాయలసీమ ఎఫ్ పి ఓల సమ్మేళనం

(6వ పేజీ తరువాయి)

అమ్మకందారుల సమావేశాలను నిర్వహించి,, చిరుధాన్యాల ప్రోత్సాహానికి అవకాశాలను అన్వేషించడం.

- రాయలసీమ జిల్లాలలోని ఎఫ్‌పిఓలు తమ సభ్యులకు వారి వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచి, బలమైన వ్యాపార సంస్థలుగా అభివృద్ధి చెందడానికి నిర్దిష్ట వ్యూహం , కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం

ఈ రాయలసీమ ఎఫ్‌పిఓల సదస్సులో రైతుల పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఏర్పాటుచేసిన స్టాల్స్ అందరిని ఆకట్టుకున్నాయి. తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా ఎఫ్‌పిఓలు రాష్ట్ర ప్రభుత్వంనుండి తగిన గుర్తింపు, తోడ్పాటు పొంది, మౌలిక సదుపాయాలను, మూలధనాన్ని, సాంకేతికతను మెరుగుపరచుకుని, మరిన్ని మార్కెట్ అవకాశాలను పొంది, గణనీయంగా అభివృద్ధిచెందగలవనే ఆశావహ దృశ్యాన్ని ఈ సమ్మేళనం తమ ఎట్టఎదుట నిలిపిందని సమ్మేళనంలో పాల్గొన్న రైతు సంస్థల నాయకులు తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. ■

# చిత్తూరులో మామిడి రైతుల సమస్యల చర్చావేదిక

– వినాయకరెడ్డి, డా. ఎం.భార్గవి

చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులు ఎదుర్కొంటున్న మార్కెటింగ్ సమస్యలపై ఫిబ్రవరి 21న చిత్తూరులో మామిడి రైతులు, ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ శ్రీ రాహుల్ పాండే, జిల్లా కలెక్టర్ శ్రీహరినారాయణ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యానశాఖ అధికారులతో పాటు జిల్లాలోని ప్రముఖ మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులు, మామిడి రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్.రెడ్డి



ముఖ్యఅతిథిగా పాల్గొని మామిడి రైతులు సమస్యలను వివరించి, ప్రభుత్వపరంగా చేపట్టవలసిన చర్యలను అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, పరిష్కార మార్గాలను గురించి చర్చించడంతో పాటు కొన్ని తక్షణపరిష్కార చర్యలను సిఫారసుచేశారు.

**సమావేశ ముఖ్యంశాలు**

- ప్రస్తుతం మామిడి కాపు ప్రధానంగా నాలుగు దశలుగా వుంది. కొన్ని చెట్లు పిందె స్థాయిలో, కొన్ని చెట్లు తెలుపుపూల స్థాయిలో, ఇంకొన్ని పచ్చపూల స్థాయిలో, మరికొన్ని చెట్లు చిగురు ఆకుల దశలో వున్నాయి. పూలు అధికంగా ఉండుట వలన దిగుబడి కూడా బాగా రావచ్చు. అయితే ధర తగ్గే అవకాశం వుంది. ఒకే సీజన్‌లో ఇలా వివిధ దశలలో చెట్లు ఉండడం వలన రైతులు నష్టపోయే అవకాశం వుంది.
- గత కొన్ని సంవత్సరాలుగా గమనిస్తే మామిడి కాయల ధరలు ప్రారంభంలో ఒక కేజీ ధర రూ. 12 వుండగా గరిష్టంగా రూ. 14 అయి ఆ తరువాత రూ. 7 తగ్గింది. ధర తగ్గుట వలన ఒకే సారి ప్రాసెసింగ్ పరిశ్రమలకు పంపడం జరిగింది.
- కొన్ని తోటలలో చెట్లు బంకపట్టి ఉండడం వల్ల కాపు తగ్గే అవకాశం వుంది.
- మామిడి పంటలకు సోకే వివిధ రకాల చీడపీడలపై రైతులకు అవగాహన తక్కువ.
- ఉత్పాదక వ్యయాలు ఎక్కువ, ఆదాయం తక్కువ
- మాంగో బోర్డ్ వుండాలి.
- ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని ప్రాసెసింగ్ కంపెనీలు ఇతర ప్రాంతాల నుండి మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నాయి. కాని చిత్తూరు జిల్లాలోని రైతులనుండి కొనుగోలు చేసినట్లయితే వారికి ప్రోత్సాహం లభిస్తుంది.
- రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు.
- మామిడి కాయలకు కవర్లు వేస్తే, మంచి ధర పొందవచ్చు

**పరిష్కార మార్గాలు :**

- రైతులందరూ ఒకేసారి కాయలు కోయకుండా కొందరు ఒకరోజు, మరికొందరు మరోరోజు కోసినట్లయితే మంచి ధర పొందవచ్చు. రైతులు సంఘటితంగా వుండాలి. అప్పుడే ఇది సాధ్యం

- ఉద్యాన శాఖ వారి సూచనలను పాటించి, మామిడి రైతులు వివిధ రకాల చీడపీడలపై అవగాహన పెంచుకోవచ్చు
- మామిడి సాగుపై అధ్యయనం చేసి మామిడి సాగుకు అయ్యే ఖర్చును అంచనావేసి, తదనుగుణంగా కనీస మద్దతు ధర ప్రకటించాలి.
- ప్రాసెసింగ్ కంపెనీలు కూడా రైతు ఉత్పత్తిదారు సంస్థలతో సత్సంబందాలు కొనసాగిస్తూ రైతులు మంచి ధర పొందడానికి తోడ్పాటు అందించాలి.
- కొన్ని రకాల మామిడి పంటలను ప్రోత్సహించుటకు ప్రభుత్వం ప్రత్యేకంగా సబ్సిడీలు ప్రకటించాలి.
- సుస్థిర వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా రైతులు పంట ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకోవచ్చు. జీవన ఎరువులను , జీవన క్రిమిసంహారక మందులను వాడుట వలన ఖర్చు తగ్గుతుంది.
- దేశవాళి మామిడి రకాలను ప్రోత్సహించాలి .
- టేబుల్ రకాల ధరలను పెంచుటకు సమావేశాలు నిర్వహించాలి.
- కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో మ్యాంగో బోర్డు త్వరగా నిర్ణయాలు తీసుకోవాలి
- తోతాపురి రకానికి కనీసమద్దతు ధర రూ. 15 వుండాలి.
- రైతులు, ఎఫ& పి ఓలు కలసి బార్గెయినింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసుకుని, కాంపిటిటివ్ మిషన్ ఆఫ్ ఇండియాకు తెలియజేస్తూ వుండాలి.
- మామిడి కాయలకు కప్పే కవర్లు ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ ధరలకు అందించాలి
- కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రాసెసింగ్ కంపెనీలకు కావలసిన కంటైనెర్ డిపో మొదలగు సౌకర్యాలు కలిపించాలి.
- ఉద్యానశాఖ ద్వారా రైతులకు నిరంతర విస్తరణ సేవలు అందిస్తూ పంట ఖర్చులను తగ్గించుటకు తోడ్పడాలి. రైతు భరోసా కేంద్ర సిబ్బంది, సచివాలయాల సిబ్బందికి శిక్షణలు ఇవ్వాలి. నిషేధించిన క్రిమిసంహారక మందులపై అవగాహన కల్పించాలి
- రైతు భరోసా కేంద్రాలు మామిడి పంట రకాలపై సర్వే నిర్వహించి రకాలను అంచనా వేయాలి
- మహాత్మాగాంధి జాతీయ ఉపాధి హామీ పథకం లేదా రాష్ట్రీయ కృషి వికాస యోజన ద్వారా మామిడి రైతులకు సబ్సిడీ యివ్వాలి.
- మామిడి సరఫరా నిరంతరంగా కొనసాగే విధంగా రైతు ఉత్పత్తిదారు సంస్థలకు, వాటి సమాఖ్యలకు ప్రాసెసింగ్ కంపెనీలకు మధ్య సత్సంబంధాలు వుండాలి.
- ప్రాసెసింగ్ కంపెనీలు వాటి సామర్థ్యం పెంచుకోవాలి
- ప్రాసెసింగ్ కంపెనీలు ఎగుమతుల పెంపుదల కొరకు సౌకర్యాలు పెంచుకోవాలి.
- కొన్ని రకాల బోగస్ పురుగు మందులను ప్రభుత్వం నిషేధించాలి.
- పరస్పర సంప్రదింపుల కొరకు బార్గెయినింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి.
- రైతులు పండించే పంటల పరిమాణాన్ని తనిఖీ చేయాలి.
- రైపెనింగ్, కోల్డ్ స్టోరేజ్, రవాణా, మార్కెటింగ్ కొరకు అవస్థాపనా సౌకర్యాలు కలిపించడానికి కచ్చితమైన ప్రణాళిక అవసరము.
- మామిడి ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ కొరకు పంచవర్ష ప్రణాళిక అవసరం
- ప్రస్తుతం రైతులు పండించే పంటలలో 90% నేరుగా ప్రాసెసింగ్ పరిశ్రమలకు వెళుతున్నది. మిగిలిన 10% మార్కెట్ యార్డు ద్వారా వర్తకులు కొనుగోలు చేసి తిరిగి ప్రాసెసింగ్ పరిశ్రమలకు పంపుతున్నారు. అందువలన వర్తకుల స్థానంలో ఎఫ్ పి ఓలను ప్రోత్సహించాలి.
- ఉద్యానశాఖ ద్వారా మామిడి పంటలలో రైతులు చేయవలసిన పనులు – చేయకూడని పనులపై కరపత్రాలు ముద్రించి రైతు భరోసా కేంద్రం, ఎఫ్ పి ఓల ద్వారా పంపిణీ చేయాలి. ■

**ఆనందం అంటే అంతులేని సంపద కాదు ; వున్న కొన్నిటిని చక్కగా వినియోగించుకోవడం**

# అడ్డుగోడలను కూల్చివేస్తూ ... ఆర్తులకు అండగా నిలుస్తూ ...!

పుస్తక సమీక్ష

**అ**ధికారం ఒక పరమపద సోపాన పటం! 'పరమపదం' అనే మాట వ్యక్తిగా చేరుకోవలసిన ఒక పవిత్ర, నిష్కళంక, మహోన్నత స్థాయికి సంకేతం. ఒక సాధారణ వ్యక్తిగా సమాజాభివృద్ధికి తోడ్పడడానికి ఎన్నో పరిమితులు వుంటాయి. అధికారం యిచ్చే చట్టబద్ధమైన బలం, సమకూర్చే



వనరులు ఆ పరిమితులను అధిగమించి, సమాజ శ్రేయస్సుకు, అభ్యున్నతికి కృషిచేయడానికి అధికారులకు అవకాశం కల్పిస్తాయి. ఆ అధికారం అందుకోసమే. కాని, సహజంగానే అధికారానికి అహంకారం సరిజోడు. పైగా అధికార పీఠాలకు, అవినీతికి విడదీయలేనంతగా కళంకిత బంధం పెనవేసుకుపోతుండడం సర్వసాధారణంగా మారుతున్న కాలమిది. పరమపద పటంలో ఒక్కొక్కటిగా ఉన్నత వ్యక్తిత్వం, సదాశయం, నిజాయితీ, కార్యదక్షత అనే నిచ్చెనలను ఎక్కుతూ పరమపదాన్ని చేరుకునేవారు అరుదై, సంకుచిత వ్యక్తిత్వం, స్వార్థం, అవినీతి, ఆశ్రితపక్షపాతం,ఆహంకారం వంటి అవలక్షణాలనే పాములనోళ్ళలో పడి తాము పతనమై, సమాజాన్ని తిరోగమనం చేయిస్తూ, అధికార వ్యవస్థను అథ:పతితం చేస్తున్నవారు పెచ్చుమీరుతున్నారు.

ఈ నేపథ్యంలో, ' బ్రేకింగ్ బారియర్స్' అంటూ వచ్చిన శ్రీ కాకి మాధవరావు గారి ఆత్మకథ చదివినప్పుడు మనస్సు ఎంతో ఊరటచెందింది. శ్రీ మాధవరావు ఐ ఏ ఎస్ కావడం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర స్థాయిలో అత్యున్నత అధికార పీఠాన్ని అధివసించడం నిజానికి ఆకాశానికి నిచ్చెనవేయడం లాంటిది! ఈ విస్మయానికి కారణం, ఆయన పూర్వరంగం. ఆయన పుట్టింది కృష్ణాజిల్లాలోని ఒక కుగ్రామంలో. నిరుపేద దళిత కుటుంబంలో. తండ్రి ఒక భూస్వామి దగ్గర పాలేరు. తల్లి వ్యవసాయ కూలీ. పొట్టగడవడమే అంతంతమాత్రమై, మాధవరావుకు చదువు చెప్పించడం దండగఅని, పాలేరుగా పెట్టాలని తండ్రి పట్టుపడితే, భర్తను బతిమిలాడి బామాలి, దెబ్బలు తిని తల్లి మాధవరావును బడికి పంపించింది. నాటి ఆ చిరు విత్తనం యింతటి మహావృక్ష మవుతుందని ఎవరు కలగంటారు? పైగా యిప్పుడు వారిది ఏడుగురు ఐ ఏ ఎస్, ఒక ఐ పి ఎస్ తో కూడిన అరుదైన, అమిత సాధికార కుటుంబం!

శ్రీ మాధవరావుది మొదటినుంచి విలక్షణ వ్యక్తిత్వం. ఒకవంక బహు సున్నితత్వం, మరోవైపు మెట్టుదిగని మొండితనం! వేలెత్తి చూపలేని నిజాయతీతో నిలవాలని, మాటపడకూడని నడవడితో సాగాలనే మనస్తత్వం. ఆ హృదయ మార్దవం ఆయన ఎప్పుడూ తాను ఎక్కివచ్చిన మెట్లను గుర్తుంచుకునేలా, తోటివారికి, పేదసాదలకు వీలున్నంతగా తోడ్పడేలా చేసింది. ఆ మొండితనం అవసరమైతే, నమ్మిన సిద్ధాంతంకోసం, ఆచరించదలచుకున్న మంచికోసం, ఆత్మగౌరవ సంరక్షణకోసం ముఖ్యమంత్రులనైనా ఎదిరించి నిలిచే సాహసాన్ని యిచ్చింది. లేకుంటే, శ్రీ అంజయ్య ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఆయన ఆమోదముద్ర వేసిన ఫైల్‌ను అది చట్టబద్ధం కాదంటూ మూడుసార్లు తిప్పి పంపగలుగుతారా? చండశాసన ముఖ్యమంత్రి శ్రీ మర్రిచెన్నారెడ్డి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయాలనుకుంటే, అది వివాదాస్పదమని నోట్ పంపి, 'మీరు నా అధికారాన్నే సవాలు చేస్తున్నారు' అన్న ఆయన హుంకరింపునకు ఎదురు నిలవగలుగుతారా? ఆ స్థిరసంకల్పమే, పదవీ విరమణానంతరం ఎస్ సి, ఎస్ టి సబ్‌ప్లాన్‌కు సవరణలు తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, తోటి ఉద్యమకారులతో కలసి తాను అరెస్ట్ కావడానికి, కులవివక్షకు వ్యతిరేకంగా పార్లమెంట్ సభ్యుల మద్దతు కూడగట్టే వ్యూహంలో భాగంగా గుండు గీయించుకోవడానికి వెనుకాడని తెగువను అందించింది. ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ అనంతరం తనను ఎన్నికల ప్రధానాధికారిగా నియమించిన రాష్ట్రప్రభుత్వంపైనే ఒక నిబంధనకు సంబంధించి కోర్టులో రిట్‌పిటిషన్ వేయించిందీ ఈ రాజీలేని పోరాట స్వభావమే!

అసిస్టెంట్ కలెక్టర్ మొదలుకొని, అధికార సోపాన పథంలో రాష్ట్ర స్థాయిలో అత్యున్నత స్థానమైన ప్రధాన కార్యదర్శి (ఛీఫ్ సెక్రెటరీ) పదవి, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి, బీహార్ గవర్నర్ సలహాదారు, సహకార సంఘాల ఉన్నతాధికార కమిటి ఛైర్మన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ పాలకవర్గం ఛైర్మన్, ఏపిమాస్ ఛైర్మన్ యిలా ఎన్నో పదవులను నిర్వహించిన, నిర్వహిస్తున్న శ్రీ మాధవరావు తన ప్రతి పదవీ ప్రస్థానంలోను ప్రజాహితమైన, సామంజస్యపూరిత

గెలుపు అలవోకగా రాదు ; ఎన్నో కష్టాలు , సుదీర్ఘ నిరీక్షణలు , అనేక త్యాగాల ఫలితమది

(ఈక్విటబుల్) సమాజానికి దోహదకారకమైన ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఈ లక్ష్య సాధనకు ఆటంకంగా నిలచిన అనేక దుర్నిబంధనలను, దుష్ట సంప్రదాయాలను నిష్కర్షగా ఎదిరించి నిలిచారు. 'నక్సలైట్ కలెక్టర్ 'అని ప్రచారంచేసినా జంకలేదు, కోర్టుకేసులు వేసి వేధించినా వెనుకడుగు వేయలేదు.

ప్రభుత్వ కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పలువురు ముఖ్యమంత్రులతో సన్నిహితంగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం శ్రీ మాధవరావుది. నాటి ప్రధాని పి వి నరసింహారావు నుంచి, వివిధ ముఖ్యమంత్రులు, మంత్రుల గురించి తన ఆత్మకథలో ప్రస్తావించినపుడు కొందరితో తనకు కలిగిన యిబ్బందులను, ఎదుర్కొన్న సమస్యలను గురించి వివరిస్తూనే, వారి వ్యక్తిత్వంలోని కొన్ని మంచి లక్షణాలను ఏకరువుపెట్టే హృదయ సంస్కారం ఆయనది. తన వల్ల తెలిసో, తెలియకో ఎవరికైనా ఏదైనా యిబ్బంది కలిగిందేమోనని అపరాధభావంతో పరితపించే సున్నితమైన మనస్సు! ఐఏఎస్ శిక్షణ సమయంలో గుర్రపు స్వారీ పోటీలో శ్రీ యుగంధర్ (మరొక విశిష్ట ఐ ఏఎస్ అధికారి) గుర్రం వెనుకబడడానికి తాను కారణమేమోనని యిప్పటికీ మనసు నొచ్చుకునే స్వభావం. అదే సమయంలో తన నిజాయితీకి ఎక్కడ మచ్చవస్తుందోనని తన కుమారుని స్వతంత్ర జీవనోపాధి ప్రయత్నాన్ని అడ్డుకోవడం, తన వదినె యింటి స్థలం కొనుక్కోవడానికి అడ్డంపడడం, ఆ పై పరితపించడం శ్రీ మాధవరావు నిష్కళంక ప్రియత్వానికి, కోమల హృదయానికి నిదర్శనం.

బహుముఖ ప్రజ్ఞాశాలి అనే మాట శ్రీ మాధవరావుకు చక్కగా సరిపోతుంది. సరే, సాధారణ ప్రతిభకు సాధ్యంకాని, సంక్లిష్ట ఐ ఏ ఎస్ ఉన్నత విద్యలో సఫలంకావడం, ఎంతో సమర్థతతో, దక్షతతో వివిధ కీలక పదవులను నిర్వహించడం సంగతి పక్కనపెడితే, తన నిజాయితీ, ముక్కుసూటితనం తన పదవికి ముప్పుతెస్తుందేమోనని, ఎందుకైనా మంచిదని ఆయన న్యాయవాద విద్యఅభ్యసించి, పదవీ విరమణ అనంతరం ఏపి హైకోర్టులో న్యాయవాదిగా నమోదుచేసుకున్నారు. చిన్నతనంలో మురళి వాయించడం వచ్చినా, తప్పుచేయకపోయినా తనను కొట్టాడని తండ్రిమీద కోపంతో ఏళ్ళతరబడి మౌనంపాటించి, పట్టుదలతో, నిరసనగా ఆ కళకు వీడ్కోలు పలికాడు. మక్కువతో గుర్రపుస్వారీ చేసే రౌతు. ఆయన ఒక మంచి గాయకుడు. అంతేకాదు ఆరు పదులు దాటిన వయసులో శాస్త్రీయ సంగీత పాఠాలు నేర్చుకుని, పాటలకు , పద్యాలకు బాణీలు కట్టిన సంగీతకారుడు కూడా! ఎస్ పి బాల సుబ్రహ్మణ్యం వంటి ప్రముఖ గాయకుల మెప్పు పొందినవాడు. ఇంతే కాకుండా, ఆయన ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యాధ్యయనంతోపాటు గుర్రం జాషువా వంటి సుప్రసిద్ధ ప్రజాకవుల కవితలను, కొన్ని నవలలను ఆంగ్లంలోకి అనువదించిన ఉభయభాషావేత్త .

ఇక, పేదలకు, తరతరాలుగా అణచివేతకు గురైన వర్గాలకు, మహిళలకు అండగా నిలచి, సమాజంలోని అసమానతలను వీలున్నంతగా నిర్మూలించే కార్యక్రమాలకు పదవీవిరమణానంతరం ఆయన పూర్తిగా అంకితమైనారు. 'ఆసియా దళిత హక్కుల వేదిక ', శ్రీ జయప్రకాశ్ నారాయణ్ 'లోక్ సత్తా', 'ఫోరం ఫర్ డెమొక్రాటిక్ రైట్స్', చర్చావేదిక మంథన్, ఎస్ సి, ఎస్ టి, బి సి, మైనారిటీల సామాజిక న్యాయ వేదిక మొదలైన వివిధ సామాజిక సంస్కరణోద్యమాలలో ఆయన క్రియాశీల భాగస్వామి. వీటితోపాటు స్వయంసహాయ ఉద్యమ స్ఫూర్తితో పేద మహిళలను, చిన్న రైతులను సంఘటితపరచి వారి అభ్యున్నతికి రెండుదశాబ్దాలకుపైగా పాటుపడుతున్న 'మహిళాభివృద్ధి సొసైటి ' (ఏపిమాస్) పాలక వర్గ అధ్యక్షునిగా ఆయన ఆశావహమైన సామాజిక భవితవ్యంకోసం ఉత్తమ మార్గదర్శనం చేస్తున్నారు. 'అలుపెరుగని అంకిత భావంతో పనిచేస్తున్న సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి' నేతృత్వంలోని ఈ ఏపిమాస్ పాలకవర్గ అధ్యక్షత 'రిటైర్మెంట్ అనంతరం చేపట్టిన పదవులలో ఎంతో సంతృప్తిని యిచ్చిన పదవి 'అని శ్రీ మాధవరావు పేర్కొన్నారు.

ఇది ఎంతో స్ఫూర్తిదాయకమైన స్వీయచరిత్ర. అందరూ చదవదగినది. ఉత్తమాభిరుచి కలిగిన అధికారులు, భావి పౌరులు తప్పక చదువవలసినది. పైగా, రచనానైపుణ్యం వున్న శ్రీ మాధవరావు చేతిలో యిది చాలా ఆసక్తిదాయకంగా రూపుదిద్దుకున్నది. మంచి మనిషిగా, ఉత్తమ అధికారిగా నిలవడమేకాక, ఇంత చక్కగా తన స్వీయ చరిత్రను చెప్పిన శ్రీ మాధవరావు ఎంతైనా అభినందనీయులు. నేను చదివింది 'బ్రేకింగ్ బారియర్స్' ఆంగ్ల మాతృకకు తెలుగు అనువాదాన్ని. ఈ అనువాదం కూడా ఎంతో సరళంగా, ఏకబిగిని చదివించేలా సాగుతుంది. అనువాదకులు, సీనియర్ జర్నలిస్ట్ శ్రీ రఘురాములు కూడా అభినందనీయులు. ఈ ఆత్మకథ వెలువడడానికి ప్రధాన కారణమైన ఎమెస్కో ఛైర్మన్ శ్రీ విజయకుమార్ ఈ పుస్తక ప్రచురణ కర్త.

– జె వి క్రిష్ణమూర్తి ■

# పెరటికోళ్ళ పెంపకంతో అదనపు ఆదాయం

– డాక్టర్ టి.వినోద్‌కుమార్, బి. నవ్య, డాక్టర్ ఎ. శ్రీనివాస్

**తె**లంగాణా రాష్ట్రం పెద్దపల్లి జిల్లా, మంథని మండలం, నాగారం గ్రామంలో అన్ని సాధారణ గ్రామాల మాదిరిగానే వ్యవసాయ ప్రధాన గ్రామం. చాలా గ్రామాల మాదిరిగానే నాగారంలో ఎక్కువ మంది రైతులు పేదవారు. దీనితోపాటు ఆ రైతు కుటుంబాలవారికి ఇతర జీవనోపాధుల పట్ల ఆసక్తి, అవగాహన చాలా తక్కువగా ఉండడాన్ని గమనించిన రామగిరిఖిల్లా 'కృషి విజ్ఞాన కేంద్రం' వారు ఆ రైతులు అదనపు జీవనోపాధులతో తమ ఆదాయాలను పెంచుకునే



విధంగా ప్రోత్సహించాలని సంకల్పించి, గడిచిన సంవత్సరం ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రం కింద ఆసక్తి కనబరచిన 20 మంది రైతులను ఎంపికచేసి ఒక్కొక్క కుటుంబానికి 20 చొప్పున రాజశ్రీ కోళ్ళను పంపిణీచేశారు. ఈ 20 మంది రైతులకు కృషి విజ్ఞానకేంద్రం వారు పెరటికోళ్ల పెంపకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించి, కోళ్ళకు సకాలంలో వ్యాక్సినేషన్ చేయించి. వాటి దాణాకు సంబంధించిన ముడిపదార్థాలను రైతులకు అందించారు.



ఈ 20 మంది రైతు కుటుంబాలలో మద్దెల మల్లీశ్వరి అనే 38 సంవత్సరాల మహిళా రైతు తమ కోళ్ళను జాగ్రత్తగా పెంచుకుని అవి పెట్టే గుడ్లను అమ్ముకుని యూనిట్‌ను విస్తరించుకోవడానికి ఆసక్తి కనబరిచింది. ఆమె ఇంటర్మీడియేట్ వరకు చదువుకున్నారు. కృషి విజ్ఞానకేంద్రం, వారు ఈ పెరటి కోళ్ల పెంపకం ద్వారా స్వయం ఉపాధి పెంపొందించే విధంగా ఆమెకు సూచనలు యిచ్చారు. అనంతరం ఆమె గుడ్లను పొదిగించడం కోసం ఒక ఇంక్యుబేటర్‌ను కొనుగోలు చేసుకుని కోడిపిల్లలను సులువుగా ఉత్పత్తి చేసుకోగలుగుతున్నారు.

ఈ విధంగా ఆ మహిళారైతు ఇంక్యుబేటర్ సహాయంతో ఒక సంవత్సరం కాలంలో 500 గుడ్లను, 100 కోడిపిల్లలను పొందింది. వాటిని ఆమె ఒక్కో గుడ్డును 15 రూపాయలు చొప్పున, నెల కోడిపిల్లలను ఒక్కొక్కటి 30 రూపాయల చొప్పున పక్క గ్రామాలలో అమ్మడం జరిగింది. ఈ యూనిట్‌ని విస్తరించే విధంగా



కోడిపిల్లలను పెంచి వాటి మాంసాన్ని కేజీ 400 రూపాయల చొప్పున అమ్ముతూ ఆమె చెప్పుకోదగిన లాభాలను పొందింది.

ప్రస్తుతం వీరి దగ్గర 250 రాజశ్రీ కోళ్ళు వున్నాయి. ఆసక్తిని గమనించిన కృషి విజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్లా వారు ఇటీవల ప్రియ నెల వయస్సు కోడిపిల్లలను ఇవ్వడం జరిగింది. వీటి పెరుగుదలను ఎప్పటికప్పుడు కృషి విజ్ఞానకేంద్రం వారు పర్యవేక్షిస్తున్నారు. ఈ యూనిట్ విస్తరణకు కావలసిన సూచనలు ,సలహాలను ఎప్పటికప్పుడు ఆ కుటుంబానికి అందజేస్తున్నారు.

**(వ్యాస రచయితలు పెద్దపల్లి జిల్లా, రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు)**

■

రాజీపడడం బలహీనత కాదు ; సత్ఫలితంకోసం మహనీయులు ఎన్నో రాజీపడతారు

# మహిళా సమ్మాన్ సేవింగ్స్ మేలా? బ్యాంక్ ఎఫ్‌డి మేలా ?

**'ఆ**జాదీకా అమృత్ మహోత్సవం'లో భాగంగా మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా కొత్త చిన్న మొత్తాల పొదుపు పథకాన్ని 2023-28 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పేరుతో ప్రవేశపెట్టిన ఈ పథకం 2023 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు రెండేళ్ళపాటు అందుబాటులో ఉండనుంది. ఈ నేపథ్యంలో పథకానికి సంబంధించిన అంశాలతో పాటు, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సరిఫికేట్లు, బ్యాంకు ఎఫ్‌డీ ఈ రెండింటిలో ఎందులో మదుపు చేయడం ద్వారా ఎక్కువ ప్రయోజనం లభిస్తుందో చూద్దాం...

**మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్**

**అర్హత:** మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్లను మహిళలు లేదా బాలికల పేరుపై మాత్రమే తీసుకునే వీలుంది.

**డిపాజిట్ పరిమితులు**



ఈ పథకంలో గరిష్ఠంగా 2 లక్షల రూపాయల వరకు డిపాజిట్ చేయవచ్చు. కనీస మొత్తం పేర్కొనలేదు.

కాలపరిమితి : ఈ పథకానికి రెండేళ్ళ కాలపరిమితి ఉంటుంది. ఈ పథకం రెండేళ్ళపాటు అంటే 2023 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు అందుబాటులో ఉంటుంది.

వడ్డీ రేటు : ఈ పథకానికి 7.50% స్థిర వడ్డీ రేటును ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం చిన్న మొత్తాల పొదుపు పథకాలలో బాలికల కోసం ఉద్దేశించిన సుకన్య సమృద్ధి యోజన పథకానికి 7.60% , సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ కోసం 8% వడ్డీ రేటు లభిస్తోంది. ఈ రెండు పథకాల తర్వాత అధిక వడ్డీ రేటు ఇస్తున్న పథకం ఇదే కావడం విశేషం.

**ప్రీ మెచ్యూర్ విత్ డ్రా :** ఈ పథకంలో పాక్షిక ఉపసంహరణలను ప్రభుత్వం అనుమతించింది. అయితే ఏవిధంగా వర్తిస్తాయనే విషయంపై ఇంకా స్పష్టత లేదు.

పన్ను ప్రయోజనాలు : సాధారణంగా బాలికల కోసం అందించే సుకన్య సమృద్ధి యోజన వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాలకు సెక్షన్ 80సి కింద మినహాయింపు లభిస్తుంది. కానీ ఈ పథకానికి పన్ను మినహాయింపు గురించిన వివరాలు పేర్కొనలేదు.

**మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ ఎలా తెరవాలి ?**

- ఈ పథకం 2023 ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి వస్తుంది.
- మీ సమీపంలోని బ్యాంక్ లేదా పోస్టాఫీసును సందర్శించి మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన ఫారంను తీసుకోవాలి.
- వ్యక్తిగత, ఆర్థిక, నామినేషన్ వివరాలను అందించి దరఖాస్తు పూర్తి చేయాలి.
- గుర్తింపు, చిరునామా రుజువు కోసం అవసరమైన పత్రాలను దరఖాస్తు ఫారంతో పాటు సమర్పించాలి.
- డిపాజిట్ మొత్తాన్ని ఎంచుకొని, నగదు లేదా చెక్కు ద్వారా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.
- పెట్టుబడికి రుజువుగా సర్టిఫికెట్‌ను ఇస్తారు. దీన్ని తీసుకోవాలి.

**ఎంత వడ్డీ వస్తుంది.**

రెండేళ్ల పాటు ఈ పథకం గరిష్ఠ పరిమితి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడితే.. ఏడాదికి 7.50% వడ్డీ చొప్పున మొదటి సంవత్సరంలో రూ.15,000, రెండో సంవత్సరంలో రూ.16,125. మొత్తంగా రూ.31,125 వడ్డీ పొందొచ్చు.

**బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్**

**వడ్డీ రేట్లు :** భారతీయ అతిపెద్ద బ్యాంకు 'స్టేట్ బ్యాంక్

ఆఫ్ ఇండియా' ప్రస్తుతం రెండేళ్ళ కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీలపై) 6.75% వడ్డీ ఇస్తోంది. అలాగే, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, కోటక్ మహీంద్రా వంటి కొన్ని బ్యాంకులు ఇదే కాలపరిమితి గల డిపాజిట్లపై 7% వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. అంటే, కొన్ని పెద్ద బ్యాంకులు ఎఫ్‌డీపై అందించే వడ్డీ రేటు కంటే మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 0.50% నుంచి 1% ఎక్కువ వడ్డీనే అందిస్తోంది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ వంటి కొన్ని బ్యాంకులు రెండేళ్ల కాలపరిమితి గల డిపాజిట్లపై 7.50% వడ్డీ ఆఫర్ చేస్తుండగా.. కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 8% వడ్డీని కూడా ఆఫర్ చేస్తున్నాయి.

**డిపాజిట్ పరిమితి :** మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ డిపాజిట్లకు రూ.2 లక్షల గరిష్ట పరిమితి ఉంది. అందువల్ల అంత మొత్తం మాత్రమే డిపాజిట్ చేయగలం. బ్యాంకు ఎఫ్‌డీల్లో ఎంతైనా డిపాజిట్ చేయవచ్చు.

**రిస్క్ ఉండదు :** మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనేది ప్రభుత్వ మద్దతు ఉన్న పొదుపు పథకం. కాబట్టి, అసలు, వడ్డీ మొత్తాలకు భద్రత ఉంటుంది. ఎటువంటి నష్టభయం ఉండదు. కాని, బ్యాంకు ఎఫ్‌డీలకు కొద్దిపాటి రిస్క్ ఉంటుంది. అయితే, ఆర్బీఐ డిపాజిట్ ఇన్సూరెన్స్ ప్లాన్ వర్తించే బ్యాంకుల్లో రూ.5 లక్షల వరకు బీమా సదుపాయం ఉంటుంది. వీటిలో డిపాజిట్లతో రిస్క్ తగ్గుతుంది.

**వృద్ధులకు శుభవార్త**

- సీనియర్ సిటిజన్లకు సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ కింద ప్రస్తుతం గరిష్ఠ పరిమితి రూ.15 లక్షల వరకు మాత్రమే ఉంది. దీన్ని రూ.30 లక్షలకు వరకు పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.
- మంత్లీ ఇన్ కమ్ స్కీమ్ పరిమితిని సైతం కేంద్రం సవరించింది. ఇప్పుడున్న 4.5 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచారు. జాయింట్ అకౌంట్ కలిగిన వారికి ప్రస్తుతం ఉన్న రూ. 9 లక్షల నుంచి రూ. 15 లక్షలకు పెంచారు. 7.10% వడ్డీ లభిస్తుంది. ■

## గుజరాత్‌లో ఠాకూర్ అమ్మాయిల ఫోన్లపై నిషేధం

**అ**మ్మాయిలు మొబైల్ ఫోన్లు వినియోగించడాన్ని గుజరాత్‌లోని ఠాకూర్ కమ్యూనిటీ నిషేధించింది. ఈ మేరకు సంప్రదాయాన్ని సంస్కరించే తీర్మానం చేసింది. మొబైల్ ఫోన్లు వాడడం వల్ల అమ్మాయిలు పెడదారి పట్టే అవకాశం ఉందని సంఘం భావించింది. అందుకనే వివాహం కాని అమ్మాయిల ఫోన్ల వాడకంపై నిషేధం విధించినట్టు పేర్కొంది. అయితే, ప్రేమ వ్యవహారాలు, అమ్మాయి-అబ్బాయి స్నేహాలు, కులాంతర వివాహాల గురించి ప్రస్తావించలేదు.



కాంగ్రెస్ ఎమ్మెల్యే జెనీబెన్ ఠాకూర్ సమక్షంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. బనస్కాంత జిల్లా భభర్ తాలూకాలోని లున్సెలా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే, నిశ్చితార్థం, పెళ్లిళ్లకు హాజరయ్యే అతిథుల సంఖ్యను కూడా పరిమితం చేశారు. నిశ్చితార్థానికి 11 మంది, వివాహానికి 51 మంది అతిథులకు మించడానికి వీల్లేదు. ప్రతి గ్రామంలోనూ ఠాకూర్ ప్రజలు పెద్ద సంఖ్యలో ఉండడంతో ఖర్చులు తగ్గించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివాహాల్లో డీజేను ఉపయోగించడంపైనా నిషేధం విధించారు.

తమ సామాజిక వర్గం వారు ప్రతి ఒక్కరు ఈ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఉల్లంఘిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. జరిమానాల ద్వారా వచ్చే సొమ్మును విద్యతో పాటు తమ సామాజిక వర్గంలో సౌకర్యాలకు ఖర్చు చేస్తామని సంఘం ప్రకటించింది. ఉన్నత చదువుల కోసం గ్రామం నుంచి బాలికలు నగరాలకు వెళ్లేటప్పుడు వారికి రవాణా సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని సంస్కరణల్లో పేర్కొన్నారు. ■

మూర్ఖులతో వివాదపడడమూ మూర్ఖత్వమే

# తెలంగాణా పల్లెల్లో 'అంకురాల' ఏర్పాటు

**హైద**రాబాద్ లోని టీహబ్... వీహబ్, టీవర్క్స్, టీఎస్ఐసీ తదితర చోట్ల ఏర్పాటవుతున్న అంకురాలు (స్టార్టప్స్) ఇకపై పల్లెలకూ రానున్నాయి. వినూత్న ఆలోచనలు, ప్రయోగాలతో ముందుకొచ్చే పల్లెవాసులకు సాయం అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అంకుర పరిశ్రమల కార్యక్రమానికి (స్టార్టప్ విలేజ్ ఆంత్రప్రెన్యూర్షిప్ ప్రోగ్రామ్) శ్రీకారం చుట్టబోతోంది. తొలుత రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ఈ కార్యక్రమం చేట్టాలని నిర్ణయించిన సర్కారు ప్రాథమికంగా రూ.50 కోట్లు కేటాయించింది. తద్వారా 11,711 అంకుర పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని సర్కారు నిర్దేశించుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం అంకుర విధానాన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత ఇప్పటికే దాదాపు 12 వేలకు పైగా అంకుర పరిశ్రమలు ఏర్పడ్డాయి. హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో విద్యార్థులు, యువత, సాంకేతిక నిపుణులు వినూత ఆలోచనలతో ముందుకొస్తే అవి కార్యరూపం దాల్చేందుకు ప్రభుత్వం సహకరిస్తోంది. ప్రయోగాలతోపాటు ఉత్పత్తుల కోసం ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేసి, స్థలాలను ప్రభుత్వమే కేటాయిస్తోంది. అంకుర సంస్థ ఉత్పత్తికి సిద్ధమైన తర్వాత వారికి పెట్టుబడులు సమకూర్చడంతో పాటు ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సాయం అందిస్తోంది. కొన్ని సంస్థల ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఈ వ్యవస్థ విజయవంతం కావడంతో సర్కారు తాజాగా గ్రామాలపై దృష్టి సారించింది. ఈ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో అంకుర సంస్థలను నెలకొల్పడానికి, అవి స్థిరంగా కొనసాగడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. దీనికి ఐటీ శాఖ సాయంతో టీహబ్, వీహబ్, టీవర్క్స్ వంటి సంస్థలు అవసరమైన సాంకేతిక నైపుణ్య శిక్షణ, సలహాలను అందిస్తాయి. ప్రయోగాలకు అవసరమైన పరికరాలను పంపిణీ చేస్తాయి. బ్యాంకులతో పాటు స్వయ సహాయక సంఘాల ద్వారా రుణం అందించేందుకు సహకరిస్తాయి.

**ఏయే జిల్లాల్లో...**

19 జిల్లాల్లో 4 దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, నాగర్ కర్నూల్, ములుగు, రంగారెడ్డి, సంగారెడ్డి, నారాయణపేట, నల్గొండ, జనగామ, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వనపర్తి, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు ఇందులో ఉన్నాయి. ■

## తల్లిని వేధిస్తున్న కొడుకుకు, కోడలికి రెండు వారాల జైలుశిక్ష

**వృ**ద్ధాప్యంలో ఉన్న తల్లిని తీవ్ర చిత్రహింసలకు గురి చేస్తూ, ఇంటి నుంచి బలవంతంగా వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తున్న కుమారుడు, కోడలుకు రెండువారాల జైలు శిక్ష విధిస్తూ వయోవృద్ధుల ప్రత్యేక ట్రైబ్యునల్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణానికి చెందిన పుల్లూరి నాగమణికి వెంకన్నబాబు అనే కుమారుడు ఉన్నాడు. పెళ్లి చేసి అతని కుటుంబంతోనే ఆమె కలిసి ఉంటున్నారు. గత ఏడాది జూలైలో సబ్ కలెక్టర్ సూర్యతేజకు కుమారుడు వెంకన్నబాబు, కోడలు రేవతిపై నాగమణి ఫిర్యాదు చేశారు. 'బూతులు తిడుతున్నారు. బాత్‌రూమ్‌కు వెళితే బయట నుంచి తలుపు గడి పెడుతున్నారు. నా కుమారుడు ఇప్పటికి నాలుగైదుసార్లు చెయ్యి కూడా చేసుకున్నాడు. తిండి పెట్టడం లేదు' అంటూ వాపోయారు. వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినా మార్పు లేకపోవడంతో వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం– 2007 ప్రకారం ట్రైబ్యునల్ కోర్టువిచారించి శిక్ష విధించారు. ■

నీ మాటలు నీ మంచితనానికి సంకేతం, నీ చేతలు నీ గొప్పతనానికి నిదర్శనం

# జొన్నలపై మూడు దశాబ్దాల పరిశోధనా 'రత్నం'!



భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ తొలి మహిళా డైరెక్టర్ శ్రీమతి చామర్తి వెంకట రత్నావతి. 30 ఏళ్లపాటు జొన్నలపై వివిధ పరిశోధనలు చేశారు. బీరు తయారీకి వరినూక బదులు జొన్నలు వినియోగించవచ్చని తన పరిశోధనల ద్వారా నిరూపించిన మొదటి వ్యక్తి కూడా ఆమే.! పొగాకు నుంచి ప్రొటీన్‌ను ఉత్పత్తి చేయచ్చనీ చూపించారు. ఇలాంటి మరెన్నో అద్భుతాలు శ్రీమతి రత్నావతి పరిశోధనల ద్వారా వెలుగు చూశాయి. అవి అంతర్జాతీయ జర్నల్స్‌లోనూ ప్రచురితమయ్యాయి. ఆ విశేషాలతో పాటు తన నాలుగు దశాబ్దాల పరిశోధనారంగ అనుభవాల విశేషాలను ఆమె ఆంధ్రజ్యోతి 'నవ్య'తో పంచుకున్నారు! ఆ విశేషాలు ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ' మహిళా సాధికారత ' పాఠకులకోసం అందిస్తున్నాం...

**నా** వృత్తి జీవితంలో భాగంగా ముప్ఫై ఏళ్లు కేవలం జొన్నల మీద పరిశోధనలకే అంకితమయ్యాను. ఏడేళ్ల కిందట జొన్న పరిశోధనా కేంద్రాన్ని భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థగా మార్చారు. దీనికి తొలి మహిళా సంచాలకురాలిగా బాధ్యతలు స్వీకరించినందుకు సంతోషిస్తున్నాను. పైగా ఓ తెలుగు వ్యక్తిగా గర్విస్తున్నాను. చిరుధాన్యాల పరిశోధనల్లో నాది ప్రత్యేకమైన అనుభవం. ఇప్పుడు మా దృష్టంతా... జీవనశైలి సమస్యలను అధిగమించేందుకు జనాన్ని చిరుధాన్యాల వైపు మళ్లించడం మీదే.! వడ్ల మిషీన్‌తోనే జొన్నల అటుకులు తయారు చేయవచ్చని ప్రయోగపూర్వకంగా నిరూపించాం. జొన్న రొట్టె తయారీ యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చాం. చిరుధాన్యాలతో రకరకాల ఆహార పదార్థాలు వండే పద్ధతులను పరిచయం చేస్తున్నాం. మరీ ముఖ్యంగా సేమియా, పాస్తా, కేకులు వంటి ఆహారపదార్థాలనూ పెద్ద ఎత్తున తయారుచేయిస్తున్నాం. ఇలా రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను భాగస్వామ్యం చేసుకోవడంపైన విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అంతకు మించి కొన్నేళ్ళ కిందట ప్రపంచ బ్యాంకు సహకారంతో జొన్నలోని బహుళ ప్రయోజనాలను కనుకొనే పరిశోధనలను చేపట్టాను. సాధారణంగా చెరుకు పిప్పినుంచి వచ్చే మొలాసిసతో ఇథనాల్ తయారుచేస్తారు. అదే తక్కువ పెట్టుబడి, అతి తక్కువ సమయంలో చేతికొచ్చే 'చెరుకు జొన్న' అనే కొత్తరకం తోనూ ఇథనాల్ ఉత్పత్తి చేయచ్చని మా పరిశోధన ద్వారా కనుగొన్నాం. ఈ కొత్తరకం పంటలో గింజల దిగుబడి తక్కువున్నా, తియ్యగా ఉండే జొన్నగడలతో ఇథనాల్ తయారు చేయచ్చని చక్కెర ఫ్యాక్టరీలకు పరిచయం చేశాం. దాన్ని ప్రోత్సహించాం కూడా. తద్వారా సాగునీరు ఆదా అవుతుంది. దాంతో పర్యావరణానికీ మేలు. రైతుకూ లాభం.



**జొన్నలతో బీరు...**

జొన్న ప్రధానంగా వర్షాధార పంట. పైగా ఖరీఫ్ సీజన్‌లో, అంటే తొలకరిలో విత్తితే, అక్టోబరులోపు పంట చేతికొచ్చేస్తుంది. సరిగ్గా వర్షాకాలంలో కంకులు కోతకొస్తాయి. ఒక్కోసారి చేతికొచ్చిన పంట చేలోనే వానకు తడవడంతో గింజ కాస్త నల్లబడుతుంది. దాన్నెవరూ పెద్దగా కొనరు. అలాంటి నల్లగింజలను ఏమి చేయొచ్చు అనుకుంటుండగా, మాకొక ఆలోచన తట్టింది. అప్పటికప్పుడు ముంబాయిలోని ఓ బీర్ల తయారీ ఫ్యాక్టరీని సంప్రతించి, వారి సహకారంతో బీరు తయారీలో బార్లీతో పాటు వరినూకకు బదులు జొన్ననూక వాడితే ఎలా ఉంటుందా అని ప్రయోగం చేశాం. అదీ మంచి ఫలితాన్ని ఇచ్చింది. అప్పటి నుంచి బీరు తయారీలో

జొన్నలనూ ఉపయోగిస్తున్నారు. ఇదంతా రైతులకు అదనపు విలువను సమకూర్చే పద్ధతులను పరిచయం చేయడంలో భాగంగా కనుగొన్న మార్గాలు. తర్వాత చిరుధాన్యాలను పూర్తిగా ఆహార అవసరాలకే వినియోగించే పద్ధతుల మీదే శ్రద్ధ పెట్టాం. ఆ దిశగానే మా కార్యచరణ కొనసాగుతోంది. ఎర్ర జొన్నలను పిట్టలు కూడా ముట్టవు అనే అపోహ చాలామంది రైతుల్లో ఉంది. అయితే, ఎర్రజొన్నల్లో కొత్తరకం వంగడాలను రైతులకు పరిచయం చేశాం. వాటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల రక్తం పలుచపడటంతో పాటు అజీర్తి, కీళ్ళ నొప్పులు వంటి సమస్యలు నియంత్రణలో ఉంటాయని గుర్తించాం. పైగా ఎర్రజొన్నలతో వండిన ఆహార పదార్థాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.

**మధుమేహానికి జొన్నలు...**

మధుమేహ నియంత్రణకు జొన్నలు మంచి ఆహారం. దీన్ని ఒట్టి నోటిమాటగా కాకుండా, జాతీయ పోషకాహార సంస్థతో కలిసి ప్రయోగాత్మకంగా నిరూపించాం. తద్వారా జొన్నలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కొద్దిరోజుల పాటు పూర్తిగా జొన్నలతో వండిన ఆహారాన్ని అందించాం. తద్వారా పిల్లల ఎదుగుదలలో మంచి మార్పులను గుర్తించాం. జొన్న బలవర్ధకమైన ఆహారమనడానికి ఇదే నిదర్శనం. ఏడేళ్లుగా మా పరిశోధనా కేంద్రంలో జొన్నతో పాటు 11 రకాల చిరుధాన్యాల మీద ప్రయోగాలు నిర్వహిస్తున్నాం. భారత ప్రభుత్వ ప్రతిపాదన మేరకు, ఐక్యరాజ్య సమితి 2023ను 'అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం'గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అవి ఎంత వరకు ఆహార, ఆరోగ్య భద్రతలను ఇవ్వగలవనే దానిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. సుమారు లక్షమందితో రైతు సంఘాలు నెలకొల్పి, చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాం. అందులో ఆదివాసీ, గిరిజన, మహిళా రైతులనూ భాగస్వామ్యం చేశాం. నిరుద్యోగ యువతకు మిల్లెట్స్ వంటకాల తయారీపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. వాళ్లు క్యాంటీన్‌లు, బేకరీ లు నడుపుకోవడానికి అవసరమైన రుణాలనూ ఇప్పించేందుకు సహకరిస్తున్నాం.

**మొ**దట నేను రాజమండ్రిలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థలో శాస్త్రవేత్తగా చేరాను. పొగాకు ప్రాణాంతకం కనుక, ధూమపానం వంటి అలవాట్లకు కాకుండా, ప్రత్యామ్నాయంగా దాన్నెలా వినియోగించవచ్చు అనేదానిపై పరిశోధన చేయాలి అనుకున్నాను. ఆ నేపథ్యంలోనే లేత పొగాకు నుంచి ప్రొటీన్ ఉత్పత్తి చేయచ్చని గుర్తించాను. అలా తయారు చేసిన ప్రొటీన్‌ను ఎలుకలమీద ప్రయోగించాం. మంచి ఫలితాలు వచ్చాయి. అదే సమయంలో హైదరాబాద్‌లోని జొన్న పరిశోధనా కేంద్రానికి బదిలీ అయ్యాను. దాంతో ఆ పరిశోధన అక్కడితో ఆగిపోయింది. తర్వాత దాన్ని మరికొందరు కొనసాగించారని విన్నాను. కానీ అది పూర్తిగా అందుబాటులోకి రాలేదు.

**పొలమంటే తెలియని నేను...**

చదువుకునేప్పుడు నాకు జొన్నకు, మొక్కజొన్నకు తేడా తెలిసేది కాదు. పొలానికి ఎన్నడూ వెళ్లిందీ లేదు. అలాంటిది, జొన్న పరిశోధనలో ఇంత వరకు ప్రయాణించడం... ఆనందంగా ఉంది. నా పరిశోధనలకుగాను రెండు సార్లు జాతీయ స్థాయి ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నాను. వందకుపైగా పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి. అదీ ప్రతిష్ఠాత్మక 'బయో మాస్ అండ్ బయో ఎనర్జి' అమెరికా జర్నల్‌లో నా పరిశోధన వ్యాసానికి అమితాదరణ లభించింది.

'రైతులకు మంచి చేయాలనే' దృఢ సంకల్పమే నన్ను ఇంత దూరం తీసుకొచ్చింది. మా స్వస్థలం రాజమండ్రి. మా నాన్న చామర్తి లక్ష్మయ్య ఆయుర్వేద వైద్యుడు. మాది సనాతన కుటుంబ నేపథ్యమైనా, నన్ను చదువుకోమని బాగా ప్రోత్సహించారు. నాకిష్టమైన కోర్సు చదివేందుకు స్వేచ్ఛ ఇచ్చారు. ఎంఎస్సీ బయోకెమిస్ట్రీ, ఎంఫిల్ హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో పూర్తి చేశాను. చిన్నప్పటి నుంచి చదువు అంటే నాకు ఇష్టం. కనుక క్లాసులోనూ మొదటి ఐదు ర్యాంకుల్లోనే ఉండేదాన్ని. ఎంఫిల్ ప్రవేశ పరీక్షలోనూ ఫస్ట్

వచ్చాను. అప్పుడే 'న్యూరో కెమిస్ట్రీ'లో భాగంగా కోడిని నమూనాగా తీసుకొని, అది పెరిగేకొద్దీ దాని మెదడులో వచ్చే మార్పుల మీద పరిశోధన చేశాను. సాధారణంగా నల్ల శిలీంధ్రం సోకిన మొక్కజొన్న, వేరుశెనగ తింటే కాలేయ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అదే ఫంగస్ పట్టిన జొన్నలు తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తవని నా పీహెచ్‌డీ పరిశోధన ద్వారా నిరూపించాను. జొన్నలపై పొర చాలా పటిష్టంగా ఉండటమే అందుకు కారణం. కనుక నల్లమచ్చలున్న జొన్నలను పాలీష్ చేయించుకొని ఆహారంగా వినియోగించుకోవచ్చు.

**సమన్వయమే మహిళా శాస్త్రవేత్తలకు సవాలు**

ఒకప్పుడు ఆడవాళ్లు ఎక్కువగా బోధనా వృత్తిని ఎంచుకునేవారు. ఇప్పుడు ఐటీ రంగంవైపు చాలామంది మొగ్గు చూపుతున్నారు. అయినప్పటికి, పరిశోధనా రంగంలోనూ మహిళల సంఖ్య తక్కువేమీ కాదు. ఇప్పుడు మా సంస్థలోనే పది మంది వరకు మహిళా శాస్త్రవేత్తలున్నారు. ఈ రంగంలో రాణించేందుకు జెండర్ అడ్డంకి కాదు. కాకపోతే, మహిళలు మరింత ఎక్కువ కష్టపడాలి. మరీ ముఖ్యంగా ఆడవాళ్లకు కుటుంబ ప్రోత్సాహం చాలా అవసరం. ఒక్కోసారి ల్యాబ్‌లో గంటల తరబడి ఉండాల్సి వస్తుంది. దూర ప్రయాణాలూ ఉంటాయి. పరిశోధనలకు రోజులతరబడి సమయం వెచ్చించాలి. అలాంటప్పుడు కుటుంబ బాధ్యతలను విస్మరించలేం కదా.! అలా అని వృత్తికి అన్యాయం చేయలేం. ఆ రెండింటినీ సమన్వయం చేసుకోవడమే పరిశోధనా రంగాల్లోని మహిళల ముందున్న అతిపెద్ద సవాల్.

నా భర్త శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరరావు కూడా పరిశోధనా రంగంలోనే పదవీ విరమణ చేశారు. మాకిద్దరు అబ్బాయిలు. వాళ్ళు అమెరికాలో స్థిరపడ్డారు. మా అత్తమామల తోడ్పాటు వల్లే నా వ్యక్తిగత, వృత్తి జీవితాన్ని విజయవంతంగా నెట్టుకురాగలిగాను. మరో కొన్ని నెలల్లో నేనూ రిటైర్ అవుతాను. అలా అని, తర్వాత ఇంటికే పరిమితం కాను. మధుమేహ నియంత్రణకు సరైన ఆహారాన్ని గుర్తించడమే నా లక్ష్యం. ఆ దిశగా నా పరిశోధనలు కొనసాగుతాయి. ■


## ఫారమ్ - IV

**'మహిళా సాధికారత' తెలుగు మాస పత్రిక యాజమాన్యం, ఇతర అంశాల ప్రకటన**

1. ప్రచురణ కేంద్రం : హైదరాబాద్
2. ప్రచురణ కాల వ్యవధి: నెల (మాస పత్రిక)
3. ముద్రణకర్త పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి
   జాతీయత : భారతీయత
   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం,ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089
4. ప్రచురణకర్త పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి
   జాతీయత : భారతీయత
   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం,ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089
5. సంపాదకుని పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి
   జాతీయత : భారతీయత
   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం,ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089
6. పత్రిక యాజమాన్యంలో భాగస్వాములైన లేదా మొత్తం వాటా ధనంలో ఒక శాతానికి మించి వాటాదారులైన వ్యక్తుల పేర్లు, చిరునామాలు: ---లేరు---

టి.చంద్రశేఖర్ రెడ్డి అనే నేను పైన పేర్కొన్న అంశాలన్నీ నాకు తెలిసినంతవరకు వాస్తవమని నమ్ముతూ, ఇందు మూలముగా ప్రకటిస్తున్నాను.

తేదీ:01-03-2023 ప్రచురణకర్త సంతకం

# దిగుబడి తగ్గి, ధర తగ్గి మిర్చి రైతు బేజారు

**మి**ర్చి రైతు కంట కన్నీరు ఒలుకుతోంది. సాగు ఆరంభం నుంచి అంతా ప్రతికూలంగా మారింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెట్టుబడులు భారీగా పెరిగాయి. ధరలు దిగజారాయి. దిగుబడులు అంతంతమాత్రంగానే వస్తున్నాయి. మరోవైపు కూలీల కొరత వెంటాడుతోంది. గత ఏడాది క్వింటా రూ. 25వేల వరకూ ధర పలికిన తేజ రకం ప్రస్తుతం రూ. 16,500 మించి లేదు. నాటు రకాలకూ ఇదే పరిస్థితి ఎదురవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పర్చూరు సబ్ డివిజన్‌లో 20వేల ఎకరాల్లో సాగు**

గత ఏడాది మిర్చిపై లాభాలు రావడంతో ఈ ఏడాది పంట సాగుపై ఎక్కువమంది ఆసక్తి చూపారు. ప్రకాశం జిల్లా పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈఏడాది సుమారు 20 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఆదిలోనే ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. తొలుత వర్షాభావ పరిస్థితులు కొనసాగాయి. తరువాత అధిక వర్షాలతో పైరు దెబ్బతింది. కొన్ని వందల ఎకరాల్లో మొక్కలు ఉరకెత్తాయి. అలాంటి చేలల్లో రైతులు వ్యయప్రయాసలకోర్చి మరలా మిర్చి నాటారు. దీంతో కొంతమేర ఖర్చు పెరిగింది. చీడపీడల బెడద పెద్దగా లేదనుకుంటున్న సమయంలో నల్లి తెగులు ఆశించింది. రసం పీల్చే పురుగుల దాడి ఎక్కువైంది. డిసెంబరు 15 నుంచి గూడమంచు ప్రభావంతో కొంతమేర పూత రాలింది. ప్రస్తుతం ముదురు చేలల్లో కోతలు మొదలు కాగా దిగుబడులు తగ్గుతున్నాయి.

**కూలీల కొరత... పెట్టుబడుల భారం**

ప్రస్తుతం మిర్చికోతలు ప్రారంభం కాగా కూలీల కొరత వెంటాడుతోంది. సాగు తొలినాళ్లలో పురుగుమందులు, కలుపు తీతలకు రైతులు కొంతమేర ఇబ్బంది పడ్డారు. పర్యవసానంగా ఖర్చులు పెరిగాయి. మిర్చికి కోతలు కీలకదశ. అదునులో కాయల కోత జరగాలి. కాని స్థానికంగా ఉపాధి హామీ పనులు జరుగుతుండటంతో కూలీల కొరత ఏర్పడిందని రైతులు చెప్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూలీలకు రోజుకు రూ. 350 కూలీతోపాటు రవాణా చార్జీలు ఇవ్వాల్సి వస్తోందని వెరసి రోజుకు రూ. 400 చెల్లించాల్సి వస్తోందని చెస్తున్నారు. అయినప్పటికీ అవసరమైన మేర మనుషులు దొరకడం లేదు. దీంతో ఎక్కువమంది ఇతర ప్రాంతాల నుంచి ముఠాలను తెచ్చుకుంటున్నారు. వారికి ఆవాసం చూపటం కష్టతరంగా ఉందని చెప్తున్నారు.

**దిగజారిన దిగుబడులు.. ధరలు**

మిర్చి గత ఏడాది ఎకరాకు సుమారు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధర కూడా ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం కోతల తీరు చూస్తుంటే ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్లు మించి వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. గత ఏడాది తేజ. 5531 తదితర రకాలకు క్వింటాకు క్వింటాకు రూ. 25 వేల వరకు ధర లభించింది. నాటు రకానికి కూడా మంచి ధర దక్కింది. ఇక బాడిగ రకానికయితే వీటన్నింటికన్నా అదనంగా క్వింటాకు రూ. 5 వేల నుంచి రూ. 6వేల వరకూ లభించింది. ప్రస్తుతం తేజ, 5531 క్వింటా రూ. 16,500 నుంచి రూ. 18 వేల మధ్య మాత్రమే ధర ఉంది. బాడిగ గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం క్వింటాకు రూ. 10వేలు తక్కువ ధర పలుకుతోంది.

**క్వింటా రూ. 25వేలు తగ్గకుండా కొనుగోలు చేయాలి**

గుంటూరు యార్డు మిర్చి విక్రయాలకు పెట్టింది పేరు. అక్కడ రకాన్ని బట్టి క్వింటా రూ. 25 వేలకు తగ్గకుండా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేదంటే అవసరాలకు ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకోవల్సిన పరిస్థితి వస్తుందని వారు వాపోతున్నారు. ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులు ధరలను మరింతగా తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతు సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా సి ఇ ఓలతో ఎఫ్ పి ఓలలో మహిళా ప్రాధాన్యం !

(13 వ పేజీ తరువాయి)

తోడ్పాటు లభించేలా చూడడం, ఆ సంస్థ ఉత్పత్తిచేసే కషాయాలు మొదలైన వాటిని మార్కెట్‌చేయడానికి అవసరమైన శిక్షణలు యివ్వాలని , సాంకేతికపరంగా వారికి అవసరమైన ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తేవాలని ప్రణాళిక చేసుకున్నాం. త్వరలోనే వీటిని అమలు పరుస్తాం.

**కలకడ ఎఫ్ పి సి**



నాపేరు ప్రత్యూష, నేను కలకడ లోని రెడ్డెమ్మ ఎఫ్ పి సి లో సి ఇ ఓ గా పనిచేస్తున్నాను. మా ఎఫ్ పి సి లో మహిళా సభ్యులు కొత్త సభ్యులను చేర్పించడంలోను, సమావేశాలు ఏర్పాటుచేయడంలోను, కార్యవర్గ సమావేశాలలోను చురుగ్గా పాల్గొంటున్నారు.ఆన్ లైన్ లావాదేవీలు చేయడంలో, వారివారి మొబైల్ ఫోన్‌ల ద్వారా పంటల పరిజ్ఞానం పెంపొందించుకోవడంలో మహిళా రైతులకు శిక్షణలు యిప్పించాము. కొన్ని సంస్థలనుండి సబ్సిడీలు యిప్పించి, మహిళా రైతులను మా ఎఫ్ పి సి లో చేరడానికి ప్రోత్సహించాము. భవిష్యత్తు లో మా సంఘం లో వున్న మహిళా సభ్యులకు వారు పండించిన పంటలను మార్కెట్ చేసుకోవడం లో, సేంద్రియ పద్ధతులలో వ్యవసాయం చేయడంలో నిపుణులద్వారా శిక్షణలు ఇప్పించాలని, మా సంస్థ సమావేశాలలో, కార్యక్రమాలలోనూ చురుగ్గా పాల్గొనే మహిళా రైతులకు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలని నిర్ణయించుకున్నాం.

**హార్సిలీహిల్స్ ఎఫ్ పి సి ... 65 % మహిళా సభ్యులు**



నా పేరు మనీషా. నేను బి.కొత్తకోటలోని హార్సిలీహిల్స్ ఎఫ్ పి సి లో సి ఇ ఓ గా పనిచేస్తున్నాను. మా సంఘం మొత్తం సభ్యులలో 65% మంది మహిళా సభ్యులు వున్నారు. కుటుంబం లో మహిళలే ఎక్కువ సమయం వ్యవసాయ కార్యక్రమాలలో గడుపుతుంటారు కాబట్టి మేము ఇచ్చే శిక్షణలలో మహిళలకే ఎక్కువ ప్రాధాన్యం యిస్తున్నాము. మా ఎఫ్ పి సి లోని మహిళా సభ్యులకు సమావేశాల ద్వారా, శిక్షణల ద్వారా, క్షేత్ర సందర్శనలద్వారా వారికి పంట నైపుణ్యాలు, వ్యాపార మెళకువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి కృషిచేశాము. సంస్థకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం లో కార్యవర్గ సభ్యులు ముఖ్యభూమిక పోషిస్తారు కాబట్టి, కార్యవర్గంలో మహిళల ప్రాతినిధ్యం 50% తగ్గకుండా ఉండేలా భవిష్యత్తు లో చర్యలు తీసుకుంటాము.

**మర్యాదరామన్నపట్నం ఎఫ్ పి సి... 75% మహిళా కార్యవర్గం**



నా పేరు భార్గవి, నేను మదనపల్లిలోని మర్యాదరామన్న పట్నం ఎఫ్ పి సి లో సి ఇ ఓ గా పని చేస్తున్నాను. మా ఎఫ్ పి సి లో, కార్యవర్గం లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరిగింది. ప్రస్తుతం మా ఎఫ్ పి సి కార్యవర్గం లో 75% మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

'ఉమెన్ గేమ్ ఛేంజర్' అవార్డు కోసం 14 దేశాల నుండి మహిళా రైతులు పోటి పడగా మా ఎఫ్ పి సి అధ్యక్షురాలు శ్రీమతి క్రిష్ణరాధ ఆ అవార్డును గెలుచుకున్నారని చెప్పడానికి గర్వపడుతున్నాము.

మా ఎఫ్ పి సి లో రెండు గ్రామ రైతు సంఘాలను పూర్తిగా మహిళా సభ్యులతోనే ఏర్పాటు చేయడం జరిగింది. భవిష్యత్తు లో మా ఎఫ్ పి సి చేపట్టబోయే వివిధ రకాల వ్యాపార కార్యక్రమాలలో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి వారికి శిక్షణలు యివ్వడం, క్షేత్ర సందర్శనలకు తీసుకెళ్ళడం జరుగుతుంది. అంతే కాకుండా ఎఫ్ పి సి వ్యాపారాభివృద్ధి సబ్ కమిటీలలో, వ్యాపార, ఆర్థిక పరమైన నిర్ణయాలలో మహిళలకు అధిక ప్రాధాన్యం యిస్తాము. ■

కష్టాలు నీ నిజాయితీని నిగ్గు తేలుస్తాయ్, అడ్డంకులు నీ మనోబలాన్ని నిరూపిస్తాయ్

# ఇక తప్పనిసరి అయితేనే డిఎన్ఏ పరీక్ష!

**భా**ర్యాభర్తల మధ్య విడాకుల కేసులో పితృత్వాన్ని నిర్ధారించేందుకు పిల్లలకు డిఎన్ఏ పరీక్ష చేయాలంటూ ఆదేశించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అనివార్య పరిస్థితులు, కొన్ని అరుదైన కేసుల్లో మాత్రమే డిఎన్ఏ పరీక్ష చేయాలని స్పష్టం చేసింది. అల్పమైన ఆరోపణల నేపథ్యంలో చిన్నారులకు డిఎన్ఏ టెస్టు నిర్వహించడమంటే వారి గోప్యతకు భంగం కలిగించడమేనని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌ల ధర్మాసనం తేల్చిచెప్పింది. "పిల్లలకూ గోప్యత హక్కు ఉంటుంది. భార్యాభర్తల విడాకుల కేసులో వారు కక్షిదారులు కాదు. ఫోరెన్సిక్ / డిఎన్ఏ టెస్టులకు ఆదేశించడానికి వారేమీ వస్తువులు కాదన్న విషయాన్ని కోర్టులు గుర్తుంచుకోవాలి. భార్యాభర్తల మధ్య యుద్ధంలో చిన్నారులు బలి కాకూడదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈ క్రమంలో తల్లిదండ్రుల ప్రయోజనాల కోసం పిల్లలకు డిఎన్ఏ పరీక్ష నిర్వహించాలా? వద్దా? అనేది నిర్ణయించే ముందు పరిశీలించాల్సిన అంశాలను వివరించింది. భారతీయ ఆధారాల చట్టం 1872 లోని సెక్షన్ 112 కింద వివాహ బంధంలో భాగంగా చిన్నారి పుట్టుకపైనే అనుమానం వ్యక్తం చేసిన సందర్భాల్లో అనుసరించాల్సిన సూత్రాలు, మార్గదర్శకాలను వెల్లడించింది.

**ఫ్యామిలీ కోర్టు, బాంబే హైకోర్టు ఆదేశాల కొట్టివేత**

విడాకుల కేసులో భాగంగా తన భర్త తమ సంతానానికి డిఎన్ఏ టెస్టు చేయించాలంటూ వేసిన పిటిషన్‌ను ఫ్యామిలీ కోర్టు, బాంబే హైకోర్టు సమర్థించడాన్ని సవాలు చేస్తూ భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో భార్య తరఫున సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మదీ, భర్త తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. పిల్లల పుట్టుకకు చట్టబద్ధతపై ఆధారాల చట్టంలోని సెక్షన్ 112ను పరిశీలించకుండానే కోర్టులు డిఎన్ఏ టెస్టులకు ఆదేశాలు ఇస్తున్నాయని భార్య తరఫు న్యాయవాది సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పిల్లల ప్రాథమిక హక్కులు, గోప్యత, గుర్తింపు హక్కులు, ప్రయోజనాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని చెప్పారు. భర్త తరఫున న్యాయవాది దీన్ని ఖండించారు. పిటిషనర్ తన అక్రమ సంబంధాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని.. అందుకే అప్పీలు దాఖలు చేశారని అన్నారు. అక్రమ సంబంధాలను నిరూపించాలంటే డిఎన్ఏ పరీక్షే మార్గమని, దీన్ని గోప్యత హక్కు కింద అడ్డుకోవడానికి వీల్లేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఫ్యామిలీ కోర్టు, బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది.

సుప్రీం కోర్టు మార్గదర్శకాలు

- ఆధారాల చట్టం 1872లోని సెక్షన్ 4 కింద.. భార్యాభర్తలు కలిసి ఉన్న సమయంలో జన్మించిన పిల్లలకు పితృత్వంపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పాటు దర్యాప్తు కోరరాదు. ఇలాంటి ఆరోపణలు చేయాలంటే బలమైన ఆధారాలు ఉండాలి. లేదంటే సెక్షన్ 112 కింద విచారణను కోర్టులు అడ్డుకోవచ్చు.
- ఆధారాల చట్టంలోని సెక్షన్ 112 కింద కక్షిదారు.. పిల్లల పుట్టుకపై అనుమానం వ్యక్తం చేసినప్పుడు తనకు భార్యతో శారీరక సంబంధం లేదన్న విషయాన్ని నిరూపించాలి. అలా చేయనప్పుడు డిఎన్ఏ టెస్టుకు ఆదేశించకూడదు.
- కోర్టులు ఇలాంటి ఆదేశాలను అత్యంత అరుదైన కేసులు, అనివార్యమైన సందర్భాల్లోనే జారీ చేయాలి.
- బిడ్డల ప్రయోజనాలను తల్లే ఎక్కువగా పరిరక్షిస్తుంది. బిడ్డ మనోభావాలు దెబ్బతింటాయన్న ఉద్దేశంతో డిఎన్ఏ టెస్టుకు తల్లి అంగీకరించకపోతే.. ఆధారాల చట్టంలోని సెక్షన్ 114(హెచ్) ప్రకారం జోక్యం చేసుకోకూడదు. ■

# శరీర ఆరోగ్యాన్నంతటిని చక్కదిద్దే నడక !

నడక చక్కటి, సహజమైన వ్యాయామం. జంజాటాలేవీ లేకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా చెయ్యటానికి వీలైన, తేలికైన వ్యాయామం. అందుకే నడక అందరికీ మంచిది, మధుమేహులకు మరీ మంచిదని వైద్యరంగం స్పష్టంగా చెబుతోంది. దీన్ని గుర్తు చేసేందుకే నడకకు సంబంధించిన వివరాలు సమగ్రంగా మీ కోసం. ...

**మొదలుపెట్టేముందు...**

నడకను ఎవరైనా, ఎప్పుడైనా మొదలు పెట్టొచ్చు. 45 ఏళ్ల లోపు వారికి ఎలాంటి పరీక్షలు అవసరం లేదు కూడా, అయితే 45 ఏళ్లు దాటినవారు.. అలాగే నడిస్తే ఆయాసం, గుండెనొప్పి, అధిక రక్తపోటు వంటి సమస్యలు గలవారు



మాత్రం ముందుగా డాక్టర్ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయసు నుంచే (టైప్) మధుమేహం గలవారు డాక్టర్ సలహా మేరకే వ్యాయామం చేయాలి. ఎందుకంటే వీళ్లు ఇన్సులిన్ తీసుకుంటుంటారు. కాబట్టి రక్తంలో గ్లూకోజు బాగా పడిపోయే (హైపోగ్లైసీమియా) అవకాశముంది. మధ్యవయసులో మధుమేహం (టైపీ2) వచ్చినవారు అందరిలాగే నడవొచ్చు, కానీ ముందుజాగ్రత్తగా జేబులో రెండు గ్లూకోజు బిస్కట్లు పెట్టుకోవటం మంచిది. గ్లూకోజు పడిపోయినట్లనిపిస్తే వెంటనే తినటానికి ఉపయోగపడతాయి.

**నడకకి కావాల్సినవి**

- అన్నింటికన్నా ముఖ్యంగా ఉదయాన్నే 'తప్పకుండా నడవాలి' అనే దృఢమైన దీక్ష
- తేలికపాటి షూస్.
- కాటన్ దుస్తులు. పాలిస్టర్ వంటివి చెమటను బయటకు పోనీయవు కాబట్టి నడిచేటప్పుడు ఇవి వద్దు.

**ఎలా నడవాలి?**

**సన్నద్ధం :** మొదటి 5 నిమిషాలు చాలా మెల్లగా నడవాలి. దీంతో శరీరం వ్యాయామం చేయటానికి అనువుగా తయారవుతుంది. కండరాలు, కీళ్లు కదులుతాయి. ఒకేసారి వేగంగా నడవటం మొదలెడితే కండరాలు. పట్టేయటం, కీళ్లనొప్పుల వంటి ఇబ్బందులు ఎదరవుతాయి.

**వేగం :** మెల్లగా 5 నిమిషాలు నడిచిన తర్వాత 30 నిమిషాల సేపు వేగంగా నడవాలి. నడకలో వేగం మూలంగా ఆయాసం వంటివి రాకుండా చూసుకోవాలి. నాడీ కూడా లెక్కించుకుంటూ లక్షిత గుండె వేగంలో 3వ వంతు దాటకుండా చూసుకోవాలి.

**విశ్రాంతి:** వేగంగా నడిచిన వెంటనే నడపటం ఆపరాదు. మెల్లిమెల్లిగా వేగం తగ్గించుకుంటూ రావాలి. అలా తక్కువ వేగంతో 5 నిమిషాలు నడవాలి. దీంతో కండరాలు పట్టేయటం వంటివి ఉండవు. ఒక్కసారిగా వేగాన్ని ఆపేస్తే తలతిప్పు రావొచ్చు,

ప్రతివారం వేగంగా నడిచే సమయాన్ని 5 నిమిషాల చొప్పున పెంచుకుంటూ 30 నిమిషాల వరకు చేరుకోవాలి. శారీరంగా బలంగా వుండేవారు 40-60 నిమిషాల వరకూ పెంచుకోవచ్చు. అయితే రోజూ కనీసం 30 నిమిషాల సేపైనా నడిస్తే మరిన్ని ప్రయోజనాలు అందుకోవచ్చు..

**చిన్న చిన్న జాగ్రత్తలు**

**1. గుండె గరిష్ఠ వేగం**

మన గుండె వయసును బట్టి శ్రమ లేకుండా ఎంత వేగంగా కొట్టుకోగలదో తెలుసుకోవాలి. 220 లోంచి మన

వయసును తీసేస్తే దీన్ని తెలుసుకోవచ్చు. 220 అనేది ఒక ప్రామాణిక అంకెని గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు 50 ఏళ్ల వ్యక్తి గుండె గరిష్ట వేగాన్ని తెలుసుకోవాలంటే.. 220 నుంచి 50 తీసేయాలి. అప్పుడు 170 మిగులుతుంది కదా. అంటే 170 సార్ల వరకు గుండె ఎలాంటి ఆయాసం లేకుండా కొట్టుకోగలదన్నమాట. కానీ వ్యాయామ సమయంలో ఇంత వరకూ వెళ్లాల్సిన అవసరం కూడా లేదు.

**2. లక్షిత గుండె వేగం**

గుండె గరిష్ఠ వేగంలో సుమారు 50–75% వరకు గుండె కొట్టుకునేలా వ్యాయామం చేస్తే చాలు. ఉదాహరణకు 50 ఏళ్ల వ్యక్తి గుండె గరిష్ట వేగం 170 కదా. ఇందులో 50–75 శాతం అంటే.. 85–125 సార్ల వరకు గుండె కొట్టుకునేలా వ్యాయామం చేయాలన్నమాట.

**3. నాడిఎలా చూడాలి?**

ఒక అరచేతిలో చూపుడు వేలు నుంచి మణికట్టు దాకా రెండో చూపుడువేలును తీసుకొస్తే డాక్టర్లు నాడీ చూసే “రేడియల్ ధమని” ఉండే ప్రాంతం తగులుతుంది. బొటనవేలును ఉపయోగించి మన నాడీని మనవే చూసుకోవచ్చు.

**నడక: ఎప్పుడేం జరుగుతుంది?**

**1–5 నిమిషాలు**

వేగంగా అడుగులు కదపటం మొదలు పెట్టగానే కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే రసాయనాలు ప్రేరేపితమై... నడవటానికి అవసరమైన శక్తిని గ్రహించటం ఆరంభమవుతుంది. నడుస్తున్నకొద్దీ రక్త ప్రసరణ పుంజుకుంటుంది. గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 70–100 వరకూ పెరుగుతుంది. కండరాలు నడకకు అనుకూలంగా సన్నద్ధమవుతాయి. కీళ్లలో జిగురు ద్రవం ఉత్పత్తి పెరిగి, కీళ్లు బిగుసుకుంటే వదులవుతాయి. సాధారణంగా విశ్రాంతి దశలో నిమిషానికి 1 కేలరీ శక్తి ఖర్చైతే.. ఈ దశలో 5 కేలరీల వరకూ ఖర్చవుతుంది. మన శరీరం నడకకు కావాల్సిన శక్తిని పిండి పదార్థాలు, కొవ్వు నుంచి తీసుకోవటం మొదలు పెడుతుంది.

**6–10 నిమిషాలు**

గుండె వేగం 100 నుంచి 140కి పెరుగుతుంది. నడక వేగం పెరుగుతున్నకొద్దీ నిమిషానికి 6 కేలరీల శక్తి ఖర్చవుతుంది. రక్తనాళాలను వెడల్పు చేసే రసాయనాలు విడుదలై... రక్తనాళాలు విప్పారి.. కండరాలకు రక్త సరఫరా, దాంతో ఆక్సిజన్ సరఫరా మరింతగా పెరుగుతాయి.

**11–20 నిమిషాలు**

శ్రమతో శరీర ఉష్ణోగ్రత పెరగటం మొదలవుతుంది. ఈ వేడిని బయటకు పంపటానికి చెమట పడుతుంది. నడక వేగం పెరుగుతున్నకొద్దీ కొద్దిగా శ్వాస ఇబ్బందిగా అనిపిస్తుంది. నిమిషానికి 7 కేలరీల శక్తి ఖర్చవుతుంది. కండరాలకు శక్తి ఇవ్వటానికి ఎపినెఫ్రిన్, గ్లూకగాన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి.

**21–45 నిమిషాలు**

కొత్త శక్తి, ఉత్సాహం వచ్చినట్టు అనిపిస్తుంది. హాయిగా ఉన్న భావనను కలిగించే ఎండార్ఫిన్ల వంటి హార్మోన్లు మెదడులో విడుదలవుతాయి. దీంతో ఆందోళన తగ్గి ఉల్లాసం కలుగుతుంది. క్యాలరీలు ఖర్చు అవుతున్నకొద్దీ ఇన్సులిన్ సామర్థ్యం మెరుగవుతుంది. నడకను ఆపిన గంట వరకూ కేలరీలు ఖర్చు అవుతూనే ఉంటాయి. అధిక బరువు, మధుమేహంతో బాధపడేవారికిది ఎంతో మేలు చేస్తుంది.

**అపోహలు వద్దు**

**పెద్దవయసులో వ్యాయామం అక్కర్లేదా?**

ఇదో పెద్ద అపోహ. వయసు మీద పడినవారు సహజంగానే పని తక్కువగా చేస్తారు. అందువల్ల వీరికి వ్యాయామం బాగా ఉపయోగపడుతుంది. దీంతో కీళ్ల కదలికలు మెరగవుతాయి. ఫలితంగా కీళ్లనొప్పులు వచ్చే అవకాశం తగ్గుతుంది. అయితే వయసు మీద పడ్డవారు ఎక్కువ శ్రమతో కూడిన వ్యాయామాలు చేయటం తగదు.

**వ్యాయామంతో అలసట ఎక్కువవుతుందా?**

ఇది నిజం కాదు. వ్యాయామం చేయటం వల్ల శరీర సామర్థ్యం (ఫిట్నెస్) పెరుగుతుంది. అలసట, నీరసం, ఆందోళన తగ్గుతాయి.

**వ్యాయామంతో సమయం వృథా అవుతుందా?**

ఇది అతి పెద్ద అపోహ. వ్యాయామం చేయటం ఇష్టం లేనివాళ్లు చెప్పే సాకు. ప్రతిరోజూ.. లేదంటే కనీసం వారానికి 3-4 రోజులైనా వ్యాయామం చేయాలి. 30 నిమిషాల సేపు వ్యాయామం చేయలేనివాళ్లు 15 నిమిషాల చొప్పున 2 సార్లు కూడా చేయొచ్చు.

**సాయంత్రం నడవకూడదా?**

ఉదయం పూట నడవటం వీలుపడకపోతే సాయంత్రం వేళల్లోనూ నడవొచ్చు. కాకపోతే కాలుష్యం తక్కువగా ఉంటుంది కాబట్టి ఉదయం నడవటం మంచిది.

**హెచ్చరిక:** కడుపు నిండా భోజనం చేసి నడవటం మంచిది కాదు..

**జాగ్రత్త:** కొన్ని రోజులు నడిచి ఆపేసినవాళ్లు తిరిగి నడవాలని అనుకుంటే నెమ్మదిగా, ఆరంభించాలి.

**ముఖ్యం:** మధుమేహులకు ఆహార జాగ్రత్తలు, మందులు... వీటితో పాటు వ్యాయామమూ ముఖ్యమే..

**సూచన:** నడకతో ఒక్క మధుమేహ నియంత్రణే కాదు.. మొత్తం శారీరక ఆరోగ్య స్థితే మెరుగవుతుంది.

**సమయం:** వ్యాయామం అనగానే గంటల తరబడి చెయ్యాల్సిన పని లేదు. రోజుకు అరగంట చాలు.

**ప్రణాళిక :** నడక తక్కువ దూరంతో మొదలుపెట్టి, క్రమంగా రోజురోజుకూ పెంచుకుంటూ పోవాలి.

**ప్రయోజనం :** నడకతో ఒక్క మధుమేహ నియంత్రణే కాదు... మొత్తం శారీరక ఆరోగ్య స్థితే మెరుగవుతుంది.

**మధుమేహులకు మరీ మంచిది!**

రోజుకి 45 నిమిషాల పాటు నడిస్తే మధుమేహం అదుపులో ఉంటున్నట్లు న్యూక్యాజిల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు గుర్తించారు. నడకతో కొవ్వు ఖర్చు కావటమే కాదు, కండరాల్లో చక్కెర నిల్వ సామర్థ్యమూ మెరుగవుతున్నట్టు గుర్తించారు. మన శరీరంలో చక్కెరను కండరాలు ఎక్కువగా ఉపయోగించుకుంటాయి. ఒకవేళ కండరాలు చక్కెరను గ్రహించలేకపోతుంటే రక్తంలో గ్లూకోజు స్థాయిలు విపరీతంగా పెరిగిపోతాయి. ఇదే పెద్ద సమస్య. నడక వల్ల కండరాలకు చక్కెర గ్రహించే సామర్థ్యం పెరుగుతోందనీ, తద్వారా మధుమేహ దుష్ప్రభావాలూ తగ్గుతున్నాయని గ్రహించారు.

**నివారణ**

నడకతో మధుమేహం రాకుండా నివారించుకునే అవకాశమూ ఉన్నట్టు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ లోని మర్డోక్ చిల్డ్రన్స్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనంలో వెల్లడైంది. ఎక్కువ నడిచేవారిలో శరీర బరువు తగ్గటంతో పాటు వారిలో ఇన్సులిన్ మరింత సమర్థంగా పని చేస్తున్నట్టు వెల్లడైంది.

**ఎన్నెన్నో ప్రయోజనాలు**

- నడక శారీరక సామర్థ్యానికే కాదు. రోగనిరోధకశక్తిని పెంచి రకరకాల జబ్బుల బారినపడకుండా కాపాడుతుంది.
- గుండె సమర్థంగా పనిచేస్తుంది.గుండెపోటు రాదు
- రక్త ప్రసరణ పెరుగుతుంది. చెమట ద్వారా రక్తంలోని మలినాలు బయటకుపోతాయి.
- రక్తపోటు అదుపులో ఉంటుంది.
- మంచి కొలెస్ట్రాల్ (హెచ్డీఎల్) పెరుగుతుంది. చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌ఎల్) తగ్గుతుంది.
- రక్తంలో గ్లూకోజు స్థాయి తగ్గుతుంది.
- శరీర బరువు తగ్గుతుంది.కీళ్లు, ఎముకలు దృఢమవుతాయి.
- మానసిక కుంగుబాటు, ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి..
- కంటినిండా నిద్ర పడుతుంది..
- పెద్దపేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వంటి క్యాన్సర్ల ముప్పు తగ్గుతుందిబీ
- నీరసం, అలసట, నిస్సత్తువ తగ్గుతాయి.
- ఆత్మ విశ్వాసం, శారీరక సామర్థ్యం పుంజుకుంటాయి.
- అన్నింటికన్నా మించి.. మానసిక ఉల్లాసం కలుగుతుంది.
- నడక మూలంగా కొత్త స్నేహాలు ఏర్పడతాయి. కొత్త హుషారు వస్తుంది. ■

**ఆస్వాదించగలిగితే ఎంతో అల్పమైనవనుకునేవి కూడా అంతులేని ఆనందాన్ని యిస్తాయి**

# ఏటా ఒక సంకల్పం ... మహిళా దినోత్సవ సోపాన మార్గం !

ఐక్యరాజ్య సమితి 1975వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికి ఏడాదికొక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించడం 1996 నుంచి మొదలైంది. 1975 నుంచి స్వయంగా ఐక్యరాజ్యసమితి మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా పాటింపజేస్తున్నది. లక్ష్యసాధన దిశగా ఏడాదికి ఒక నినాదాన్ని, కార్యాచరణ పథాన్ని సమితి నిర్దే శిస్తున్నది. ఆ కార్యాచరణ ప్రణాళికామాలికను చూద్దాం!

1996 : గతాన్ని గౌరవిస్తూ, భవిష్యత్తుకు ప్రణాళిక

1997 : మహిళలు... శాంతి చర్చలు

1998 : మహిళలు... మానవ హక్కులు

1999 : మహిళలపట్ల హింసకు తావులేని ప్రపంచం

2000 : శాంతికోసం మహిళలు ఏకంకావడం

2001 : మహిళలు శాంతి, ఘర్షణలపై మహిళల అజమాయిషీ

2002 : నేటి ఆఫ్ఘన్ మహిళ ... వాస్తవాలు, అవకాశాలు

2003: లైంగిక సమానత్వం ... సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు

2004 : మహిళలు ... హెచ్ ఐ వి, ఎయిడ్స్

2005 : 2005 సంవత్సరం తర్వాత లైంగిక సమానత్వం, భద్రత కలిగిన భవిష్యత్‌ను రూపొందించడం

2006 : మహిళలు ... నిర్ణయాత్మక పాత్ర

2007 : మహిళలపై హింసకు పాల్పడే వారిని శిక్షించక పోవడాన్ని తుదముట్టించాలి

2008 : పెట్టుబడి వనరుగా మహిళలు, బాలికలు

2009 : స్త్రీ, పురుషులు కలసికట్టుగా మహిళలపైన, బాలికలపైన హింసను అరికట్టడం

2010 : సమాన హక్కులు, సమానావకాశాలు, అందరి ప్రగతి

2011 : విద్య, శిక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలలో సమానమైన అవకాశాలు ; మహిళలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పనకు మార్గనిర్దేశం

2012 : గ్రామీణ మహిళా సాధికారత ...పేదరికానికి, ఆకలికి తావులేకుండా చేయడం

2013 : వాగ్దానం వాగ్దానమే ... ఇది మహిళలపై హింసను తుదముట్టించే కార్యాచరణకు సమయం

2014 : మహిళలకు సమానత్వం అందరికీ ప్రగతి

2015 : మహిళా సాధికారతే మానవాళి సాధికారత, సాధిద్దాం

2016 : 2030నాటికి భూగోళం చెరిసగం(50–50): లైంగిక సమానత్వ సాధనకోసం ఆ దిశగా మరింత కృషి

2017 : మారుతున్న పని ప్రపంచంలో మహిళ: 2030 నాటికి భూగోళం చెరిసగం (50–50)'

2018 : ఇదే సమయం: గ్రామీణ, పట్టణ క్రియాశీల కార్యకర్తలు మహిళల జీవితాలలో మార్పు తెస్తున్నారు

2019 : 'సమానంగా ఆలోచించు, చురుకుగా నిర్మించు, మార్పు కోసం వినూత్న మార్గాన్ని అనుసరించు'.

2020 : మహిళలు హక్కులను సాధించే సమానత్వ తరం!

2021 : కోవిడ్ 19 ప్రపంచంలో సమాన భవిష్యత్తును సాధిస్తున్న మహిళా నాయకత్వం

2022 : రేపటి సుస్థిరాభివృద్ధికోసం నేడు స్త్రీ, పురుష సమానత్వం పాటిద్దాం

2023 :'అందరికీ డిజిటల్ పరిజ్ఞానం: లైంగిక సమానత్వంకోసం నవీకరణలు, సాంకేతికత' ■

## ప్రపంచ మహిళా మహాసభలు !

- ➪ మొదటి ప్రపంచ మహిళా మహాసభ: 1975 (మెక్సికో)
- ➪ రెండవ ప్రపంచ మహిళా మహాసభ : 1980 (కోపెన్ హాగన్)
- ➪ మూడవప్రపంచ మహిళామహాసభ: 1985 (నైరోబి)
- ➪ నాల్గవ ప్రపంచ మహిళామహాసభ: 1995 (బీజింగ్) (నిజానికి కొన్ని అంతర్గత వైరుధ్యాల కారణంగా నాల్గవ ప్రపంచ మహిళామహాసభ పూర్తిగా సాగలేదు. ఐదవ మహాసభ అసలు చోటు చేసుకోలేదు.

వివేకం లోపిస్తే రక్షణకోసం మనం నిర్మించుకునే కట్టడాలే మనకు అడ్డుగోడలు కావచ్చు

# స్వయంసహాయ మహిళల దశ తిరిగింది !

**బ్యాంకుల 'కస్టమర్ సర్వీస్ పాయింట్లు' స్వయం సహాయ సంఘాల మహిళలకు ఆదాయపు వనరులుగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు సులభతరం అయ్యాయి. కస్టమర్ సర్వీస్ పాయింట్లను నిర్వహిస్తూ మహిళలు నెలకు రూ. 20వేల నుంచి 60 వేల దాకా సంపాదిస్తున్నారు. ఆర్థికంగా బలపడుతూ ఆత్మగౌరవంతో బతుకుతున్నారు.**

**బ్రాం**చీలు లేని గ్రామీణ ప్రాంతాల్లో ఖాతాదారులకు బ్యాకింగ్ సేవలను చేరువ చేసేందుకు బ్యాంకులు కస్టమర్ సర్వీసు పాయింట్ పేరుతో బిజినెస్ కరస్పాడెంట్లను నియమించుకుంటున్నాయి. వీరిని విలేజ్ లెవల్ ఎంట్రప్రెన్యూర్ (వీఎస్ఈ) గా పిలుస్తున్నారు. వీరి నియామక బాధ్యతలను బ్యాంకులు పలు సంస్థలకు కేటాయించాయి. స్త్రీనిధికి మొత్తం 964 గ్రామాలను కేటాయించారు. ఇతర ప్రైవేట్ సంస్థలు పురుషులకు అవకాశం కల్పిస్తుండగా, స్త్రీనిధి మాత్రం సర్వీస్ పాయింట్లను నడిపేందుకు పూర్తిగా మహిళలకే అవకాశం కల్పించింది. అలాగే, ఎక్కువ కమిషన్ కూడా ఇస్తున్నది. ఇప్పటివరకూ 745 గ్రామాల్లో ఎస్.బీ.ఐ, 18 గ్రామాల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) కస్టమర్ సర్వీసు పాయింట్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర సర్కారు రైతుబంధు, వడ్ల కొనుగోలు ద్వారా రైతుల ఖాతాల్లోకి జమ చేసే మొత్తాన్ని వీటి ద్వారానే డ్రా చేసుకోవడంతో మహిళలకు పెద్దమొత్తంలో కమిషన్ అందుతున్నది. ఈ సర్వీసుల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ చివరి నాటికి ఏకంగా రూ. 6 వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ కస్టమర్ సర్వీసు పాయింట్లను నిర్వహిస్తున్న మహిళలు నెలకు రూ. 20 వేలనుంచి. 60 వేల వరకు అర్జించారు.

**వీరు అర్హులు...**

వీఎల్ఈగా ఎంపిక కావాలంటే మహిళా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉండాలి. ఇంటర్మీడియట్ చదివి ఉండాలి. ఎంపికైనవారికి ప్రాథమికంగా శిక్షణ ఇస్తారు. బ్యాంకింగ్ రంగంపై ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్మెంట్ (ఇర్మ) పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని వీఎల్ఈలుగా ఖరారు చేస్తారు. వీరికి బ్యాంకు అధికారులు ప్రత్యేకంగా పాస్‌వర్డ్ కేటాయిస్తారు. వీరు బ్యాంకుల తరహాలోనే డబ్బులు డిపాజిట్ చేయడం, డ్రా చేయడం, పాస్‌బుక్ ప్రింట్ చేయడం, ఒక అకౌంట్ నుంచి మరొక అకౌంట్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడం, రుణాల చెల్లింపులు చేస్తారు.



కరోనా సమయంలో వీఎలు ప్రజలకు మెరుగైన సేవలు అందించారు.

**కోటికి పైగా లావాదేవీలు**

2008లో డ్వాక్రా గ్రూపులో చేరాను. 2014 వరకు వ్యవసాయ పనులు చేశా. స్త్రీనిధి ద్వారా ఎస్బీఐ కస్టమర్ సర్వీసు పాయింట్ ఏర్పాటు చేసుకున్నా. మొదటి మూడేండ్ల వరకు నెలకు రూ.2,500 ఆదాయం మాత్రమే వచ్చేది. ఇప్పుడు కోటికి పైగా లావాదేవీలు చేస్తున్నా నెలకు రూ. 20 వేలు సంపాదిస్తున్నా. స్త్రీనిధినుంచి అవార్డు కూడా అందుకున్నా. నాకు చాలా గర్వంగా, సంతోషంగా ఉంది.

– బద్ద శ్రీలత, అస్త గ్రామం, నిర్మల్ జిల్లా

**అవార్డులు అందుకున్నా..**

నా భర్త సహకారంతో కస్టమర్ సర్వీస్ పాయింట్ నడిపిస్తున్నా. 8 ఏండ్లుగా దీన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నా, నమ్మకంగా సేవలు అందిస్తున్నా. దీంతో ఎక్కువమంది. సేవలను వినియోగించుకుంటున్నారు. అత్యధికంగా లావాదేవీలు చేసినందుకు నేను. ఇప్పటివరకు స్త్రీనిధి అధికారుల నుంచి మూడుసార్లు, బ్యాంకర్ల నుంచి రెండుసార్లు అవార్డు అందుకున్నా. –సుమ, దుబ్బాక

■

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...


వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు



## జీవనోపాధులపై....



పెరిగే వలసలు

రోగాలతో
పెరుగుతున్న ఖర్చులు

ఆహార
భద్రతకు ముప్పు

పోషకాహార
లోపాలు

తగ్గే ఉపాధి
అవకాశాలు

పంట నష్టాలతో
పెరిగే అప్పులు

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-03-2023 ; Posting Date: 05 & 06-03-2023

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23





రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమ్మేళనం ... మరికొన్ని దృశ్యాలు !












ఉల్లి విలువ గొలుసు పెంపుపై కర్నూలు సదస్సు ... మరికొన్ని దృశ్యాలు





మామిడి, టమాట పంటల మార్కెటింగ్‌పై చిత్తూరులో అవగాహన సదస్సు దృశ్యాలు

To ADDRESS



భూమాత ఎఫ్ పి ఓకు నాబార్డ్‌చే ట్రాక్టర్ అందజేత

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089